

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 26.0

గంజాయి కేసులో ఏడుగురి అరెస్టు 7



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రైతులకు సంబంధించి ధాన్యం బకాయిల నమూనా చెక్కులు అందజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, ఎమ్మెల్యేలు బడేటి చంటి, కామినేని శ్రీనివాస్, చింతమనేని

48 గంటల్లోనే ధాన్యం సొమ్ము జమ

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రైతులకు రూ.472 కోట్ల ధాన్యం బకాయిల సొమ్ము విడుదల

7



గుప్త నిధుల కోసం తవ్వకాలు

ద్వారకాతిరుమలలో కలకలం

గోతులు తీసిన ఆనవాలు, దేవుని ఫొటోలకు పూజలు

భయాందోళనలో స్థానికులు

కుచ్చెలమెట్టపై గుప్తనిధుల కోసం తవ్విన దృశ్యం

1097

- ఎయిడ్స్‌పై అవగాహనకు టోల్ ఫ్రీ నంబరు
- పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ వెట్రి సెల్వి

ఏలూరు అర్బన్, ఆగస్టు 12 : హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన, వివరాలను పొందేందుకు వీలుగా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టిన టోల్ ఫ్రీ నెంబరు 1097తో ముద్రించిన 'మీ కోసం' పోస్టర్లను సోమవారం ఏలూరులో కలెక్టర్ వెట్రి సెల్వి ఆవిష్కరించారు. జిల్లాలోని ప్రతీ గర్భిణీకి మొదటి మూడునెలల్లోనే హెచ్ఐవీ పరీక్షలు జరిగేలా జిల్లా వైద్యఆరోగ్యశాఖకు అనుబంధంగా పనిచేసే 'డాప్‌క్యూ' విభాగం అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. అదనపు డీఎంహెచ్‌వో (లెప్రసీ, ఎయిడ్స్, టీబీ) డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎనిమిది అంశాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా హెచ్ఐవీ/ ఎయిడ్స్ రహిత సమాజం కోసం పనిచేస్తామన్నారు. డీఆర్వో పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ విజయ రాజు, డాప్‌క్యూ ప్రతినిధులు, సిబ్బంది బాలాజీ, హరనాథ్‌కుమార్, జగ దీష్, యాపిల్ నెట్‌వర్క్ అధ్యక్షుడు జె.శివకృష్ణ, ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు : కలెక్టర్

ఏలూరు సిటీ, ఆగస్టు 12 : మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలను తెలియజేసి వాటి వినియోగాన్ని అరికట్టటానికి కేంద్రప్రభుత్వం నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ కె వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో నషాముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ) కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని కలెక్టర్ జిల్లా అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల వినియోగాన్ని జిల్లాలో నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఇటువంటి రుగ్మతలను రూపుమాపేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం అన్నారు. మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై పాఠశాల , కళాశాలల్లో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల సామాజిక , మానసిక , శారీరక , అనారోగ్యాలు తలెత్తుతాయని అందుకే దేశ భవిష్యత్‌ను కుంగదీసే మాదక ద్రవ్యాలను అరికడదామన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తే ఎన్‌డీపీఎస్ యాక్ట్‌లో పేరు నమోదైతే సొసైటీలో ఉనికి కోల్పోతారన్నారు. డీఆర్వో పుష్ప మణి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ముక్కంటి , భాస్కర్ , ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిడమర్రులో 42.2 మి.మీ వర్షపాతం

ఏలూరుసిటీ, ఆగస్టు 12 : నైరుతి రుతుపవనాల విజృంభించడంతో జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం కూడా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. జిల్లాలో గడచిన 24 గంటల్లో అత్యధికంగా నిడమర్రు మండలంలో 42.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 2.7 మి.మీ నమోదు అయింది. వేలేరుపాడు 30, కుక్కునూరు 3.2, కామవరపుకోటలో 0.4 మి.మీ వర్షపాతం నమోదయింది.

సర్దుబాటుని సరిదిద్దడం ఎలా?

నూతన మార్గదర్శకాల కోసం 'కౌన్సెలింగ్ బహిష్కరణ' నోటీసులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 12 : ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ తాజాగా మరోమారు 'సాంకేతిక' కారణాలతో సోమవారం వాయిదా పడింది. ఇలా వాయిదా పడిన 'మిగులు' ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు ఎదురైన అడ్డంకులను అధిగమించిన తర్వాత తుది జాబితాలను ఈ నెల 16న విడుదల చేసి, ఆ మరుసటిరోజే మండలాల్లో ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌ను నిర్వహించడానికి విద్యాశాఖ యోచిస్తున్నా క్షేత్రస్థాయిలో అది అంత సులువుగా జరిగే పరిస్థితులు కనబడడం లేదు.

గత వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జీవో 117 ఉత్తర్వులు మొత్తాన్నే రద్దు చేసి, అంతకు ముందువున్న జీవో 53 లేదా నూతన మార్గదర్శకాలను రూపొందించిన తర్వాతే వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను చేపట్టాలని టీచర్లతో పాటు, దాదాపు అన్ని ఉపాధ్యాయ సంఘాలు పట్టుబడుతుండటమే ప్రతిష్టంబనకు ప్రధాన కారణాల్లో కీలకమైందిగా చెప్పవచ్చు. మరోవైపు సర్‌ప్లస్ టీచర్ల వివరాలతో కూడిన జాబితాలను ఆదివారం రాత్రి సంబంధిత ఎంఈవోల లాగిన్‌లకు పాఠశాల విద్యాశాఖ విడుదల చేయగా, వాటిలోను లోపాలున్నట్టు పలువురు టీచర్లు సోమవారం అర్జీల రూపంలో ఎంఈవోలకు సమర్పించగా, వీటిని పరిష్కరించడానికి జిల్లా విద్యాశాఖ కసరత్తు తుదిదశకు చేరింది. గుర్తించిన మిగులు (సర్‌ప్లస్) ఉపాధ్యాయులకు సోమవారం మధ్యాహ్నం 3గంటల నుంచి మండలాల్లో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా కొరత వున్న పాఠశాలలకు సర్దుబాటు చేయడానికి ఏర్పాట్లు పూర్తిచేయగా ఆ ప్రక్రియను చేపట్టడానికి కొన్ని గంటల ముందు తాత్కా లిక నిలిపివేత/ వాయిదా సమాచారాన్ని పంపారు. వాస్తవానికి ఇప్పుడు జరుగుతున్న వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను జిల్లాల పరిధిలో మండలాలకే వదిలేసినట్టయితే స్థానిక అవసరాలకనుగుణంగా నిబంధనలకు లోబడి క్షేత్రస్థాయి విద్యాధికారులు సర్దుబాటును కొద్దిపాటి ఆటంకాలు తలెత్తినా పరిష్కరించి ప్రశాంతంగా పూర్తి చేసేవారని, దీనికి భిన్నంగా రాష్ట్రమంతటికీ తాత్కాలిక కాలానికి లోబడిచేసే సర్దుబాటు ప్రక్రియను ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌గా చేపట్టడం వల్ల కొంత గందరగోళానికి కారణం కావడంతో పాటు, సందిగ్ధతలకు తావు ఇచ్చినట్టయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'సర్దుబాటు'తో పాఠశాలల్లో టీచర్ల కొరత ఇక లేనట్టే

ఏలూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయ నిష్పత్తిని ప్రామాణికంగా తీసుకుంటే ఇప్పుడు పనిచేస్తున్న వారిలో మొత్తం 968 మంది ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు అదనంగా ఉన్నారని విద్యాశాఖ లెక్కగట్టింది. అంటే వీరందరినీ మిగులు (సర్‌ప్లస్) టీచర్లుగా గుర్తించి, వీరి వివరాలను ఆదివారం రాత్రి ఎంఈవోల లాగిన్‌లకు పంపింది. ఇలా గుర్తించిన సర్‌ప్లస్ టీచర్లలో 731 మంది ఎస్జీటీలు, 237 మంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. అదేసమయంలో జిల్లాలో 499 మంది ఉపాధ్యాయుల కొరత ఆయా పాఠశాలల్లో వున్నట్టు తేల్చారు. వీరిలో 195 మంది ఎస్జీటీలు, 304 మంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. గుర్తించిన సర్‌ప్లస్ ఉపాధ్యాయులను తొలి ప్రాధాన్యంగా స్థానిక మండలాల్లోనే కొరత వున్న పాఠశాలలకు తాత్కాలిక ప్రాతిపదికన సర్దుబాటు చేయడానికే వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను చేపట్టారు. మండలాల్లో సర్దుబాటు చేయగా మిగిలిన సర్‌ప్లస్ టీచర్లను డివిజన్ పరిధిలో, ఆ తర్వాత జిల్లా పరిధిలో అడ్జస్ట్ చేయడానికి మార్గదర్శకాలను రూపొందించారు. ఇలా సర్దుబాటు చేయడం వల్ల జిల్లాలోని ఏ ఒక్క స్కూలులోను ఉపాధ్యాయుల కొరత లేకపోవడంతో పాటు, ముఖ్యంగా హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లతో బోధనకు పూర్తిస్థాయిలో సాగుతుంది. అలాగే సర్దుబాటు ప్రక్రియ పూర్తయిన అనంతరం ఇంకావున్న సర్‌ప్లస్ టీచర్లను సంబంధిత మండలాల్లోనే విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఎక్కువగావున్న పాఠశాలలకు నియమిస్తారు. ఆ ప్రకారం వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియతో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బోధనా కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు టీచర్లు ఎక్కువ, తక్కువ కాకుండా సమతుల్యతను పాటించి నట్టవుతుందని విద్యాశాఖ చెబుతోంది.

వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవోలతో వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై టీచర్ల అభ్యంతరాలు

భిన్న వాదనలు, అభ్యంతరాలకు తెరతీసిన జీవోలు

గత వైసీపీ ప్రభుత్వం జీవో 117 ఉత్తర్వులను అమల్లోకి తెచ్చి టీచర్లను ముప్పుతిప్పలు పెట్టిందనే వాదనను ఉపాధ్యాయులు ప్రధానంగా అభ్యంతరాలను లేవనెత్తుతున్నారు. ఈ ఉత్తర్వుల వల్ల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుగా మూడంచెల విధానంలో వున్న ప్రభుత్వ పాఠశాలలు ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్, ప్రీ హైస్కూల్, హైస్కూల్-ఎ, హైస్కూల్-బి, హైస్కూల్ ప్లస్‌లుగా ఆరంచెల పాఠశాలలుగా అడ్డగోలుగా విభజించడం, విలీనం చేయడం ద్వారా మొత్తం ప్రభుత్వ విద్యావ్యవస్థనే వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందంటూ చాలాకాలంగా ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్న విషయం తెలిసిందే. జీవో 117వల్ల ముఖ్యంగా హైస్కూళ్లలో సబ్జెక్టు ఉపాధ్యాయులకు పనిభారం విపరీతంగా పెరిగిందని, అంతకుముందు అమల్లోవున్న జీవో 53 ప్రకారం ఉన్నత పాఠశాలల్లో ఒక్కో టీచరుకు వారానికి బోధించే పీరియడ్ల సంఖ్య 30 వరకు ఉండగా, జీవో 117 కారణంగా వీటి సంఖ్య 40 నుంచి 42 వరకు పెరిగాయని గుర్తుచేస్తున్నారు. గతంలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ప్రకారం బోధించాల్సిన పీరియడ్ల విధానం ఉండగా, వైసీపీ ప్రభుత్వ నిర్వాకంవల్ల సెక్షన్లను ప్రామాణికంగా తీసుకుని పనిభారాన్ని అమాంతం పెంచేశారని టీచర్లు వాపోతున్నారు. కాగా కేంద్రప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జాతీయ విద్యావిధానం ప్రకారమే రాష్ట్రంలో విద్యావ్యవస్థను సంస్కరించాల్సి వచ్చిందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.



కౌన్సెలింగ్ బహిష్కరణ నోటీసును డీఈవోకు అందజేస్తున్న 'ఫ్యాప్టో' సభ్య సంఘాల జిల్లా నాయకులు

ఉపాధ్యాయ సంఘాల 'బహిష్కరణ' నోటీసులు

వర్క్ అడ్జస్ట్‌మెంట్ మార్గదర్శకాలను సవరించిన తర్వాతే చేపట్టాలంటూ ఉపాధ్యాయ సంఘాలు 'ఫ్యాప్టో', 'జాక్టో' జిల్లా నాయకులు డీఈవో అబ్రహంకు సోమవారం బహిష్కరణ నోటీసులు వేర్వేరుగా అందజేశాయి. వీటికి అనుగుణంగా మండలాల్లో స్థానిక నేతలు ఎంఈవోలకు నోటీసులు ఇచ్చారు. సర్దుబాటులో సవరించాల్సిన విషయాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు, జిల్లా అధికారులకు తెలిపినా వాటిని సరిచేయకుండా ఏకపక్షంగా నిర్వహించ తలపెట్టిన ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తున్నట్టు ఉపాధ్యాయ నేతలు నారాయణ, రవికుమార్, ఆదినారాయణ, సాయిరాజు, రామారావు, ముస్తఫాఅలీ, రత్నం, ఆంజనేయులు, రాజ్‌కుమార్, సూర్యచంద్రరావు, తదితరులు డీఈవోకు అందజేసిన నోటీసుల్లో పేర్కొన్నారు. 2020లో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఏకపక్షంగా విడుదల చేసిన జీవోలు 117, 128ల ప్రకారం కాకుండా జీవో 53 ఉత్తర్వుల ప్రకారం పని సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్లకు సర్దుబాటు అభీష్టాన్ని తెలియజేసే వెసులుబాటు కల్పించాలన్నారు. ప్యానెల్ నంబరు లేదా ర్యాంకును సీనియార్టీకి పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కొరతవున్న పాఠశాలల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించిన విధంగా విద్యావలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు.

ఇలాచేస్తే సర్దుబాటుకు 'సరే' ?

వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు తాము సహకరిస్తామంటూనే పలు అభ్యంతరాలను లేవనెత్తుతున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు వివిధ ప్రతిపాదనలను విద్యాశాఖ ముందుంచుతున్నారు. సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌కు అనుసరించే ప్రిఫరెన్షియల్ విధానాన్ని మండల పరిధిలోని వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు వర్తింపజేయాలని కోరుతున్నారు. ఇటీవల విద్యాశాఖ జారీచేసిన మార్గదర్శకాల్లో ప్రిఫరెన్షియల్ విధానం డివిజన్, జిల్లాస్థాయి సర్దుబాటుకే ఉందని చెబుతున్నారు. నూరుశాతం దృష్టిలోపం వున్న టీచర్లకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ నుంచి మినహాయింపునిచ్చినట్టే శారీరక వైకల్యం వున్న వారిని, 70 శాతం దృష్టిలోపం వున్న టీచర్లను మినహాయింపునకు పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ వస్తోంది. ఇక మండలస్థాయి కౌన్సెలింగ్‌లో తొలుత స్థానికంగా కొరతవున్న హైస్కూళ్లు, ఆ తదుపరి ప్రాథమికోన్నత పాఠశాలలకు సర్దుబాటు చేయాలని మార్గదర్శకాలు స్పష్టం చేస్తుండగా, దీనిని పూర్తిగా మార్చివేసి మండలంలో టీచర్ల కొరతవున్న ఏ పాఠశాలనైనా తమకు నచ్చినట్టుగా కోరుకునే వెసులుబాటు కల్పించాలని పలువురు టీచర్లు షరతు పెడుతున్నారు. ఇటువంటి అభ్యంతరాలతోనే జిల్లావిద్యాశాఖకు సోమవారం అర్జీలు అందడం గమనార్హం. వీటిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.



ఫిర్యాదుదారుల వద్దకు వచ్చి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం

కలెక్టర్.. 182 అర్జీల స్వీకరణ

ఏలూరు రూరల్, ఆగస్టు 12 : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీల స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.ముక్కంటి, కె.భాస్కర్ అర్జీలను స్వీకరించారు. 182 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో క్షుణంగా పరిశీలన చేసి పారదర్శకంగా విచారణ చేసి గడువులోగా సమస్య పరిష్కరించాలని సూచించారు.

అర్జీల్లో కొన్ని.. తమ భూమిలో 30 సెంట్లు తగ్గి ఉన్నట్టు రికార్డులో ఉందని, సర్వేచేసి భూమి వివరాలు అందించాలని కొయ్యలగూడెంకు చెందిన కె.హనుమాన్ శివప్రవీణ్, డ్రెయినేజీల్లో పూడికలు తీయించాలని ఏలూరు దక్షిణపు వీధికి చెందిన వి.సాయి, పేదలకు ఉచితంగా అందించిన ఇళ్లను ఆక్రమించుకున్న వారి పై చర్యలు తీసుకోవాలని ఏలూరు గొల్లాయిగూడెంకు చెందిన గొడగాని దుర్గ, తమ ప్రాంతంలో ఎయిర్‌టెల్ టవర్ నిర్మిస్తున్నారని, దీనివల్ల రేడియేషన్ సమస్య ఉంటుందని తక్షణం టవర్ నిర్మాణ పనులు నిలుపుదల చేయాలంటూ పోణంగికి చెందిన సూర్యప్రకాశరావు, పోక్సో కేసుకు సంబంధించి పరిహారం అందించాలని, బుట్టాయిగూడెంకు చెందిన ఓ మహిళ అర్జీలు అందజేశారు.

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామంటే నమ్మొద్దు : ఎస్పీ

ఏలూరు క్రైం : ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలంటే ఉద్యోగ విద్యార్హత, ప్రవేశ పరీక్షలు, నిబంధనల ప్రకారం ఉద్యోగ నియామకాలు జరుగుతాయని, అలా కాకుండా ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామంటే నమ్మవద్దని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. ప్రతి సోమవారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం ఎస్పీతో పాటు ఏఎస్పీ స్వరూపరాణి, ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 50 మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగితే నమ్మవద్దని ఇలాంటి వారి సమాచారం 95503 51100కు అందించాలన్నారు. ఫిర్యాదులు చేయడానికి వచ్చిన వారందరికీ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు.



ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

గట్టుకు గండం!



పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ వైపు కోతకు గురైన గట్టు

కోతకు గురైన పట్టిసీమ ఫెర్రీ రేవు

ప్రమాదపు అంచుల్లో సచివాలయ భవనం

రూ.15 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు



పట్టిసీమ ఫెర్రీ రేవులో గీతాశ్రమం వద్ద కోతకు గురైన గట్టు

పోలవరం ఆగస్టు 12 : ఏటా కొవ్వాడ కాల్వ ధాటికి, కొండవాగుల దాటికి పట్టిసీమ గూటాల, పోలవరం గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల పంటపొలాలు నీటమునిగి నష్టపోతున్న నేపథ్యంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పట్టిసీమ వద్ద కొవ్వాడ కాల్వకు అవుట్ ఫాల్ స్లూయిజ్ నిర్మించారు. అప్పటి నుంచి కొవ్వాడ కాల్వ జలాలు, కొండవాగుల జలాలు పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి 23 గేట్ల ద్వారా గోదావరిలోకి కలుస్తుండడంతో పొలాలకు ముంపు బెడద తప్పింది. అయితే పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్‌కి గోదావరి వైపు స్లూయిజ్‌కి ఇరువైపులా పూర్తి స్థాయిలో రిటైనింగ్ వాల్ నిర్మించకపోవడం వల్ల ఇరువైపులా గట్టు ఏటా వర్షాల సీజనులో కొవ్వాడ కాల్వ, కొండవాగుల జలాల ధాటికి కోతకు గురవుతోంది. స్లూయిజ్‌కి కుడివైపున ఉన్న పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయ ఫెర్రీ రేవు ప్రాంగణంలో ఉన్న గ్రామ సచివాలయ భవనం, పైన ఉన్న గ్రామ రెవెన్యూ భవనం ఉన్న ప్రాంతం వరకు గట్టు ప్రమాద స్థాయిలో కోతకు గురైంది. భవనాలకు అతి సమీపంలోకి గట్టు కోతకు గురవడంతో భవనాలు రానున్న రోజుల్లో స్లూయిజ్ స్పిల్ ఛానల్‌లోకి పడిపోయే అవకాశాలు ఉన్నాయి. దీనికి తోడు పట్టిసీమ ఫెర్రీ రేవుకు ఎడమ వైపున ఉన్న రామకృష్ణ గీతాశ్రమం వైపు గట్టు దాదాపు 20 మీటర్ల మేర గతేడాది వరదలకు కోతకు గురి కాగా రాళ్ళతో ఆ ప్రాంతాన్ని పూడ్చారు. అయితే ఈ ఏడాది ఆ రాళ్లు కూడా వరద ప్రవాహ వేగానికి కొట్టుకుపోయి మరింత కోతకు గురైంది. దీంతో పట్టిసీమ ఫెర్రీ రేవుకు ఇరువైపులా గండం పొంచిఉంది. అధికారులు స్పందించి సత్వర చర్యలు తీసుకోకపోతే ఫెర్రీ రేవు పూర్తిగా గోదావరిలోకి కొట్టుకుపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. రిటైనింగ్ వాల్ నిర్మాణం విషయంపై ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ ఏఈ రాహుల్ భాస్కర్‌ని వివరణ కోరగా రూ.15 కోట్ల అంచనాలతో అవుట్ ఫాల్ స్లూయిజ్ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. పట్టిసీమ ఫెర్రీ రేవు కోత విషయంపై అఖండ గోదావరి రివర్ బండ్ ఏఈ సునీల్ కుమార్‌ని వివరణ కోరగా గోదావరి గట్టు రాళ్లతో పటిష్టపరచడానికి ప్రభుత్వానికి రూ.8 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు.


దేవుని ఫోటోలకు పూజలు, అక్కడున్న ఓ రాయికి పసుపు కుంకుమలు అద్దిన దృశ్యం

గుప్త నిధుల కోసం
తవ్వకాలు

- ద్వారకాతిరుమలలో కలకలం
- గోతులు తీసిన ఆనవాలు, దేవుని ఫొటోలకు పూజలు
- భయాందోళనలో స్థానికులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 12: ద్వారకాతిరుమల కుచ్చెలమెట్టపై గుప్తనిధుల కోసం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి వేళ జరుపుతున్న తవ్వకాలు కలకలాన్ని రేపుతున్నాయి. వారం రోజులుగా రెండు రోజులకోసారి ఇలా తవ్వకాలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. నృశింహసాగరం సమీపంలో నిర్మానుష్యంగా ఉండే కుచ్చెల మెట్టపై రాత్రివేళ లైట్లు వేసుకుని..... పలుగులతో తవ్వకాలు జరిపే శబ్దాలు విని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఆ కుచ్చలమెట్టపై పురాతన మండపం ఉండేదని, క్షీరాబ్దిద్వాదశి పర్వదినాన తెప్పోత్సవం నిమిత్తం సాగరం వద్దకు వచ్చే స్వామి, అమ్మవార్లు ముందుగా ఈ మండపం వద్దకు వెళ్లే వారని పెద్దలు చెబుతున్నారు. అయితే ఈ మండపం శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ మెట్టపైకి ఎవరూ వెళ్లలేదని వారు అంటున్నారు. అయితే గతంలో కొందరు వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపేవారన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరలా తాజాగా వారం రోజుల నుంచి ఈ ప్రాంతంలో జరుపుతున్న తవ్వకాలు ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. ఈక్రమంలో కొందరు గ్రామస్థులు సోమవారం అక్కడకు వెళ్లి పరిశీలించగా ఆ ప్రాంతంలో పలు చోట్ల రాళ్లకు పసుపు, కుంకుమలు, దేవుని ఫొటోలను ఉంచి పూజలు చేయడంతో పాటు పెద్ద గొయ్యి తీసిన ఆనవాలు ఉందని.. అటుగా వెళ్లాలంటేనే భయమేస్తోందని వారు అంటున్నారు. గుప్త నిధుల తవ్వకాలు జరుపుతున్న వారిని గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

17న సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర రైలు

ఏలూరు క్రైం, ఆగస్టు 12 : సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర రైలు ఈ నెల 17న విజయవాడ నుంచి బయలు దేరుతుందని ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అన్ టూరిజయం కార్పొరేషన్ లిమిటెడ్ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా తెలిపారు. ఈ రైలు ఉజ్జయిని (మహాకాళేశ్వర అండ్ ఓం కారేశ్వర్), ద్వారక (నాగేశ్వర), సోమనాథ్ (సోమనాధ్), పూణే (భీమశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వరుడు), ఔరంగాబాద్ (గ్రిష్ణేశ్వర్) ప్రాంతాల దర్శన యాత్రగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ రైలు 28వ తేదీ వరకూ 11 రాత్రులు, 12 పగలు యాత్ర ఉంటుందన్నారు. విజయవాడ నుంచి సికింద్రాబాద్ మీదుగా ఈ రైలు వెళ్తుందన్నారు. స్లీపర్‌లో పెద్దలకు రూ.20,590, పిల్లలకు రూ.19,255, త్రీటైర్ ఏసీ పెద్దలకు రూ.33,015, పిల్లలకు రూ.31,445, సెకండ్ ఏసీ పెద్దలకు రూ.43,355, పిల్లలకు రూ.41,465లు టికెట్ ధర ఉంటుందన్నారు. బుకింగ్ కోసం 92810 30714 లేదా 92814 95848లో సంప్రదించాలని సూచించారు.

తూర్పుగోదావరిలో ఇసుక వివరాలు ఇవే

భీమవరంటౌన్, ఆగస్టు12 : తూర్పుగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల వారిగా స్టాక్ పాయింట్ల వద్ద సోమవారం నాటికి ఇసుక లభ్యత వివరాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులుమర్రులో 10,243 మెట్రిక్ టన్నులు, పెండ్యాలలో 15,300 మెట్రిక్ టన్నులు, నిడదవోలు మండలం పందలపర్రులో 40,420 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, ఆయా స్టాక్ పాయింట్ల వద్ద టన్ను రూ.270 అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. అలాగే బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు-1లో 2,686 మెట్రిక్ టన్నులు, రావులపాడు-2లో 3,260 మెట్రిక్ టన్నులు ఇసుక అందుబాటులో ఉందని, టన్ను రూ.265లు చెల్లించి ఇసుకను ఉచితంగా పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ఏలూరు రూరల్, ఆగస్టు 12: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 48 మండలాల పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఏపీ ఎస్‌ఐఆర్‌డీ ఆధ్వర్యంలో ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం నిధులు సక్రమంగా పొందాలంటే గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీతో పాటు ఆయా పనులకు నిధులు కేటాయింపు, నిబంధనల ప్రకారం ఖర్చు చేయటం ముఖ్యమన్నారు. ఏలూరు ఎంపీడీవో బండి ప్రణవి, ఈవోపీఆర్డీ సరళకుమారి, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ నిరసన

ఇరగవరం, ఆగస్టు 12: ఉపాధ్యాయులు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించారంటూ సోమవారం విద్యార్థి సంఘం నిరసన తెలిపింది. రేలంగి జడ్పీ హైస్కూలు కొందరు ఉపాధ్యాయులు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ పాఠశాల వద్ద విద్యార్థి సంఘం బైఠాయించి నిరసన తెలిపింది. సమాచారం అందుకున్న ఎంఈవో వరప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని సంఘ నాయకులతో మాట్లాడి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం డీవైఈవో మురళీ సత్యనారాయణ పాఠశాలకు వచ్చి బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులను వివరణ కోరగా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించ లేదని కొంతమంది విద్యార్థి సంఘ నాయకులే దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

గిరిజనుల చేతిలో
కొండచిలువ హతం



జీలుగుమిల్లి, ఆగస్టు 12 : రమణక్కపేట అటవీ ప్రాంతంలో స్థానిక గిరిజనులు కొండ చిలువను హతమార్చారు. గ్రామానికి చెందిన కొందరు అడవిలోకి గొర్రెలు, మేకల్ని పశువుల్ని మేతకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో పది అడుగుల కొండచిలువ మేకల వద్దకు రాగా పసిగట్టిన కాపరులు దానిని గుర్తించి హతమార్చారు. తాము అదమరిస్తే మేక పిల్లల్ని చుట్టి చంపి తినేందుకు ప్రయత్నిస్తుందన్నారు.

48 గంటల్లోనే ధాన్యం సొమ్ము జమ

రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

ఏలూరు సిటీ, ఆగస్టు 12 : రానును ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లోనే సొమ్ము జమ చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. స్థానిక సర్‌సీఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో సోమవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రైతులకు ధాన్యం కొనుగోలు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 35,374 మంది రైతులకు ధాన్యం సొమ్ము రూ.674.43 కోట్లు చెల్లింపు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే రూ.వెయ్యి కోట్ల బకాయిలు చెల్లించిందని, మిగిలిన రూ.674 కోట్లు ఈ రోజు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయటం జరిగిందన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే రూ.472 కోట్ల ధాన్యం బకాయిల సొమ్మును రైతులకు చెల్లిస్తున్నామని ఆయన చెప్పారు. రైతులకు 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు అందజేస్తామన్నారు. పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వం ఉచితంగా చెల్లించే యోచన ఉందన్నారు. గత ప్రభుత్వం రైతులను అనేక ఇబ్బందులకు గురి చేసిందన్నారు. కనీసం తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేదని ఆయన విమర్శించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఎమ్మెల్యేలు రైతుల సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ నెల 16 నుంచి నిర్వహించే గ్రామసభల్లో కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందజేస్తామన్నారు. వరి పండించే రైతులు ఈ-పంట ద్వారా రైతు సహాయక కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో వేర్‌హౌస్ గోదాములు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గత రబీలో రెండు లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 17,496 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. అయితే రైతులకు సుమారు రూ.200 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండగా నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తదుపరి తొలుత రూ. 153 కోట్లు చెల్లించటం జరిగిందన్నారు. ఈ రోజు రూ. 47.53 కోట్ల 2,116 మంది రైతుల వ్యక్తిగత ఖాతాలకు ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఎండీ వీరపాండ్యన్ మాట్లాడుతూ గత రబీలో 12.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి తీసుకోవటం జరిగిందన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ గిట్టుబాటు ధర కల్పించే దిశగా ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కైకలూరు, తాడేపల్లిగూడెం, దెందులూరు ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, బొలిశెట్టి శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ముందస్తుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. కౌలు రైతులకు సకాలంలో సొమ్ము బకాయిలు విడుదల చేసిన ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), సొంగా రోషన్‌కుమార్, సిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి , ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పౌరసరఫరాల శాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు

ధాన్యం బకాయిలకు సంబంధించి రైతులకు చెక్కులు పంపిణీ చేయటానికి ఏలూరు వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. డీలర్లకు న్యాయం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారని రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు రామకృష్ణ, ఉదయేశ్వరరావు, మాణిక్యాలరావు, ప్రసాద్, వీర్రాజు, దుర్గారావు, డేనియల్‌రాజు, రాజకుమార్ , రాజేశ్వరి పాల్గొన్నారు.

కుల వివక్ష నిర్మూలనతోనే అభివృద్ధి : ఎమ్మెల్సీ ఇళ్ల



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

భీమవరం అర్బన్, ఆగస్టు 12 : కుల వివక్ష నిర్మూలనతోనే దేశాభివృద్ధి జరుగుతుందని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు అన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర శిక్షణ తరగతులు సోమవారం భీమవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో ప్రారంభమయ్యాయి. ఆత్మగౌరవం సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యాలతో కూడిన నీలి పతకాన్ని కేవీపీఎస్ సీనియర్ నాయకులు దిగుపాటి రాజగోపాల్ ఆవిష్కరించారు. పాలకులు కులాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణపై అనుకుల, ప్రతికూల వాదనలు చేసేవారు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కోసం ఎందుకు అడగరు అని వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి గిరిజన సంఘం రాష్ట్ర నేత మంతెన సీతారాం, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, జిల్లా ఉపాధ్యక్షులు బి.బలరాం, మహిళ నాయకులు విజయఅరుణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు, సీఐటీయూ నాయకులు జేఎన్‌వీ గోపాలన్, వాసుదేవరావు, బత్తుల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన భీమవరంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌ను సందర్శించారు.

నవోదయలో రీజనల్ క్రికెట్ ఎంపిక పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ ఉమాపతిరెడ్డి

పెదవేగి, ఆగస్టు 12 : ఏలూరు జిల్లా పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో రీజనల్ క్రికెట్ ఎంపిక పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఎంపిక పోటీలను నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ ఉమాపతిరెడ్డి సోమవారం ఉదయం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లోని జవహర్ నవోదయ విద్యాలయాలతోపాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాలలోని నవోదయ విద్యాలయాలకు చెందిన 198 మంది బాలురు, 20 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారని పెదవేగి నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. విద్యార్థుల మార్చ్ ఫాస్ట్‌తో ఎంపిక పోటీలను ప్రారంభించారు. అసిస్టెంట్ కమిషనర్ ఉమాపతిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మొత్తం మూడు విభాగాల్లో క్రికెట్ జట్ల ఎంపిక ఉంటుందని సీతాలక్ష్మి తెలిపారు. 14, 17, 19 ఏళ్ళ విభాగాల్లో పోటీలు నిర్వహించి, జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో హైదరాబాద్ రీజియన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని ఆమె వివరించారు. తొలిరోజు సోమవారం ఎన్‌సీపీ కోచ్ సత్యమూర్తి పర్యవేక్షణలో, నవోదయ విద్యాలయం పీఈటీ కె.కృష్ణ ఎంపిక పోటీలు నిర్వహించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

యువకుడి దారుణ హత్య


మృతి చెందిన నిఖిల్

ఉండి ఆగస్టు 12: చిన్ననాటి స్నేహతుల మధ్య వచ్చిన బేధాభిప్రాయాలు హత్యకు దారితీశాయి. ఐదుగురు యువకులు హత్యచేసి ఏమి తెలియనట్లు ఉండి గోరింతోటకు సమీపంలోని రైల్వేట్రాక్‌పై వేసి రైలు ప్రమాదంగా చిత్రీకరించేందుకు వారు వేసిన పన్నాగం బెడిసికొట్టింది. ఈ కేసుకు సంబంధించి ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు ఉండి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు సోమవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం గునుపూడి కందికట్లవారి వీధికి చెందిన నల్లగంగుల నిఖిల్(25)ది స్వగ్రామం కాళ్ల మండలం వేంపాడు. భీమవరంలోని సీఫుడ్ ట్రేడింగ్ కంపెనీలో ఇనస్పెక్టర్‌గా పని చేస్తున్నాడు. నిఖిల్ గ్రామానికి చెందిన పవన్ కుమార్ చిన్ననాటి స్నేహితులు. ఈ మధ్య వీరికి మనస్పర్ధలు చోటు చేస్తున్నాయి. దాంతో పవన్‌కుమార్ తరుచు నిఖిల్‌తో నిన్ను చంపేస్తానంటూ బెదిరించేవాడని తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ నేపధ్యంలో ఈ నెల 11న మృతుడు నిఖిల్‌తో ముద్దాయి పవన్‌కుమార్ కలిసి మాట్లాడు కోవడం తాను చూసినట్లు మృతుని తండ్రి ఎలీషారావు పోలీసుల కు తెలిపారు. అదే రోజు రాత్రి 9.11 గంటల మధ్య ముల్లంకి పవన్ కుమార్, మారేష్‌తో పాటు ఉండి గోరింతోటలకు చెందిన మరో ముగ్గురు యువకులతో కలిసి నిఖిల్‌ని హత్యచేసి రైల్వే ట్రాక్‌పై వేసి రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు చిత్రీకరిం చడానికి ప్రయాత్నించారని పోలీసులు తెలిపారు. కాగా గంజాయి మత్తులో గొడవ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. తన కుమారుడు నిఖిల్‌ను అన్యాయంగా హత్యచేసి పొట్టన పెట్టుకున్నారంటూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. తన కుమారుని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మృతుని కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు. నిఖిల్ మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

మామ మృత దేహానికి
తలకొరివి పెట్టిన కోడలు



ఏలూరు క్రైం, ఆగస్టు 12 : ఆయన ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి. ఆయన కుమారుడు ఎనిమిది సంవత్సరాల క్రితం అనా రోగ్యంతో మృతి చెందాడు. ఉన్న ఏకైక కుమారుడు మరణించడంతో కోడలే కొడుకు అవతారం ఎత్తింది. ఆమె మామ మరణించడంతో తలకొరివి పెట్టింది. ఈ సంఘటన సోమవారం ఏలూరులో జరిగింది. ఏలూరు తూర్పువీధికి చెందిన యర్రంశెట్టి నరసింహారావు (75) వ్యవసాయ శాఖలో పనిచేసి పదవీ విరమణ చేశారు. ఆయనకు భార్య నాగమణి, కుమారుడు గౌరీ శంకర్ కుమార్, కోడలు భవానీ ఉన్నారు. ఎనిమిదేళ్ల క్రితం కుమారుడైన గౌరీ శంకర్ అనారోగ్యంతో మరణించాడు. యర్రంశెట్టి నరసింహారావు అనారోగ్యంతో సోమవారం మరణించారు. ఆయన కోడలు భవానీయే తలకొరివి పెట్టడానికి అన్ని ఏర్పాట్లు బంధువులు చేశారు. దీంతో ఏలూరు తూర్పు వీధి నుంచి మృతదేహాన్ని సుంకరవారి తోటలో ఉన్న హిందూ శ్మశానవాటికకు తీసుకువెళ్ళారు. భవానీతో మామ మృత దేహానికి తలకొరివి పెట్టించారు.



148 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన

దెందులూరు, ఆగస్టు 12 : గ్రామంలో ఆగస్టు 15 వేడుకలు పురస్కరించుకుని విజయ నగేష్ డీఈడీ నర్సింగ్ కాలేజీ కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు 148 అడుగుల జాతీయ జెండాతో భారీ ప్రదర్శన నిర్వహించారు. నర్సింగ్ కాలేజీలో 148 అడుగుల భారీ జాతీయ జెండాను తయారు చేయించి నర్సింగ్, డీఈడీ కాలేజీ విద్యార్థులతో జాతీయ జెండా ప్రముఖ్యతను తెలుపుతూ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన వారిని స్మరిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.

గంజాయి కేసులో ఏడుగురి అరెస్టు



ఏలూరు క్రైం, ఆగస్టు 12 : విశాఖ ఏజెన్సీ నుంచి గంజాయి తీసుకువచ్చి ఏలూరు నగరంలో విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు వాటిని కొనుగోలు చేసి తిరిగి అమ్మేవారిని గంజాయిని తాగే వారిని మొత్తం ఏడుగురిని ఎస్‌ఈబీ అధికారులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ ఎస్.సూర్య చంద్రరావు తెలిపిన వివరాల ప్రకారం. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్‌కు అందిన సమాచారంతో ఆయన ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, ఎస్సీబీ అధికారులు కలసి సోమవారం రాత్రి ఏలూరు సమీపంలోని కలపరు టోల్ గెట్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా ఉండడంతో వారిని అదుపులో తీసుకుని, తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 20 కేజీల 30 గ్రాముల గంజాయిని స్వాధీ నం చేసుకున్నారు. తాడేపల్లిగూడెంకు చెందిన నమ్మి హరికృష్ణ ప్రస్తుతం ఏలూరు గణేష్ నగర్‌లో ఉంటూ, అతని స్నేహితుడైన ఏలూరు వంగాయ గూడెం ప్రాంతానికి చెందిన వడలి నరసింహ శ్రీనివాస్‌తో కలిసి విశాఖ ఏజె న్సీ చింతపల్లి నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకొచ్చినట్టుగా పోలీ సులు గుర్తించారు. వారిచ్చిన సమాచారంతో ఏలూరుకు చెందిన కొమ్మిన మణికంఠ, నంబూరి బాలు, వెలగల నాగ శివ గణేష్, రాజా జై రామ్, సంద్రాణి దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసినట్టు సూర్య చంద్రరావు తెలిపారు.

కోళ్ళ వ్యర్థాల లారీలు సీజ్

భీమడోలు, ఆగస్టు 12 : కోళ్ళ వ్యర్థాలను చేపల చెరువుల్లో వినియోగిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి హెచ్చరించారు. భీమడోలు మండలం పెదలింగంపాడులో సోమవారం ఘంటా మోహనరావు, లంక నాని, అనే ఇద్దరు వ్యక్తులు నిర్వహిస్తున్న చేపల చెరువులకు మూడు లారీలలో కోడి వ్యర్థాలను తరలిస్తున్నారనే సమాచారంతో భీమడోలు తహసీల్దార్‌ను కలెక్టర్ అప్రమత్తం చేసి లారీలను సీజ్ చేసి వ్యక్తులపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు భీమడోలు రెవెన్యూ, పోలీసు, మత్స్యశాఖ అధికారులతో కూడిన మండల టీమ్ దాడి చేసి భీమడోలు రైల్వే గేటు సమీపంలో ఉండి గ్రామానికి వెళ్తున్న కోడి వ్యర్థాల లారీలను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేశారు. కోడివ్యర్థాలను భీమడోలు డంపింగ్ యార్డులో పూడ్చిపెట్టినట్లు అధికారులు తెలిపారు.

పేకాట రాయుళ్ళ అరెస్టు

కామవరపుకోట, ఆగస్టు 12 : మండలంలోని వడ్లపల్లిలోని తోటలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.6,950 నగదు, ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తడికలపూడి ఎస్‌ఐ ఎం.జయబాబు తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

పెంటపాడు, ఆగస్టు 12 : స్నానానికి వెళ్ళిన వ్యక్తి ప్రమాదవు శాత్తు కాలువలో జారి కాలువలో పడి మృతి చెందిన సంఘటన ప్రత్తిపాడులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ప్రత్తిపాడులో వెల్డింగ్ పని చేసే ముప్పిడి శంకర్‌ప్రసాద్ (36) ఆదివారం రాత్రి గ్రామంలోని ఏలూరు కాలువ వద్ద స్నానానికి వెళ్ళిన ప్రమాదవుశాత్తు జారి కాలువలో పడ్డాడు. సోమవారం ఉదయం ఇతని మృతదేహం ఏలూరు కాలువలో ప్రత్తిపాడు ఫ్లైఓవర్ సమీపంలో తెలింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య పద్మలత ఫిర్యాదు మేరకు ఎస్ఐ శీలం శంకర్ కేసు నమోదు చేశారు.

ప్రమాదవశాత్తు కాలుజారి..


మృతి చెందిన సుబ్రహ్మణ్యం

భీమడోలు, ఆగస్టు 12 : ప్రమాదవశాత్తు కాలుజారి ఏలూరు-గోదావరి కాలువలో వ్యక్తి పడి మృతి చెందిన ఘటన భీమడోలులో జరిగింది. గ్రామానికి చెందిన పిల్లి సుబ్రహ్మణ్యం (43) సోమవారం తెల్లవారు జామున బహిర్భూమికి వెళ్ళి ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడి గల్లంతు కాగా భీమడోలు అగ్నిమాపక అధికారులు గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. అగ్నిమాపక అధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 11: గోతుల రోడ్డు ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. తాడేపల్లిగూడెంలోని తణుకు రోడ్డులో గోతుల రోడ్డును తప్పించేందుకు రాంగ్ రూట్‌లో వెళ్లిన ఆర్టీసీ బస్సు ఓ మోటారుసైక్లిస్టును ఢీకొన్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. తణుకు నుంచి తాడేపల్లిగూడెం వస్తున్న ఆర్టీసీ బస్సు ముందు గోతులు ఉన్నాయని రాంగ్ రూట్‌లోకి వచ్చింది. దీంతో ఎదురుగా వస్తున్న మోటారు సైక్లిస్ట్ షేక్ బాజి (45) ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌కు ఫోన్ చేస్తే టైం పడుతుందనడంతో ఢీకొన్న ఆర్టీసీ బస్సులోనే ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాజి మృతి చెందినట్టు నిర్ధారించారు. బాజికి కుమార్తె, కుమారుడు, ఉన్నారు. బాజి తాపీ పనిచేస్తు జీవనం సాగిస్తుంటాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

మోటారు సైకిల్ అదుపుతప్పి..

తణుకు, ఆగస్టు12 : మోటారు సైకిల్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి ఉండ్రాజవరం జంక్షన్ వద్ద జరిగింది. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద వంతెన పనులు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపునకు రోడ్డుకు అడ్డంగా తాడు కట్టారు. ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామానికి చెందిన గంగులకుర్తి పూర్ణ చంద్రసాయి కుమార్(22) అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు గురై..

ద్వారకాతిరుమల, ఆగస్టు 12: పొలంలో ఆవులను మేపుతుండగా పాము కాటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పంగిడిగూడెంకు చెందిన మట్టా కనకరాజు(63) సోమవారం ఉదయం ఆవులను మేపుతున్నాడు. ఇదే సమయంలో పాము కరవడంతో నురగ కక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన అతడ్ని పరిసర ప్రాంత రైతులు గుర్తించి అతని కుమారుడు వేణుగోపాలరావుకు తెలియపర్చారు. స్థానిక వైద్యులకు చూపించగా అప్పటికే మృతి చెందాడని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఏలూరు క్రైం, ఆగస్టు 12 : ఒక గుర్తు తెలియని వ్యక్తి పట్టపగలు రోడ్డుపై నడుచుకుంటూ వెళుతూ తూలిపోతూ పడిపోయి మృత్యువాత పడ్డాడు. ఏలూరు గూడ్స్ షెడ్ రోడ్‌లో సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి (30) రోడ్డుపై నడుచుకుంటూ వెళ్ళి ఒక మెకానిక్ షాపు ముందు పడిపోయాడు. ఇరుగు పొరుగు వారు వచ్చి చూడగా అప్పటికే అతను మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు టూ టౌన్ పోలీసులకు అందించడంతో సీఐ ఎం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ మదీనా బాషా తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 08812-230652కు సమాచారం అందించాలని కోరారు.

వ్యక్తి మృత దేహం లభ్యం

ఉంగుటూరు, ఆగస్టు 12 : మండలంలోని గోపీనాథపట్నం గ్రామంలోని చెరువులో సుమారు 60 సంవత్సరాల వ్యక్తి మృత దేహం లభ్యమైంది. ఈ మృత దేహం కుళ్ళిన స్థితిలో ఉంది. బుజ్జి అనే వ్యక్తికి చెందిన చెరువులో లభ్యం కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఎ.మణికుమార్ తెలిపారు.

శ్రీలక్ష్మి ఫైర్ వర్క్స్ షాపులో అగ్నిప్రమాదం

పెనుమంట్ర, ఆగస్టు 12 : మండలంలోని ఆలమూరులో ఉన్న శ్రీలక్ష్మి ఫైర్ వర్క్స్ హోల్ సేల్ షాప్‌లో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. షాపులో నుంచి దట్టమైన పొగ, మంటలు వస్తుండడంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు అగ్నిమాప సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో పాలకొల్లు అత్తిలి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని సమీపంలో ఉన్న చెరువులోని నీటితో సుమారు మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. పెనుగొండ సర్కిల్ ఇనస్పెక్టర్, పెనుమంట్ర ఎస్ఐ, నరసాపురం డీఎస్పీ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగానే ప్రమాదం సంభవించి ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు రూ.రెండు లక్షల ఆస్తి నష్టం సంభవించి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఫైర్ సెక్యూరిటీ వాల్స్ ఓపెన్ కావడంతోనే మంటలు అదుపులోకి వచ్చాయని అధికారులు అంచనా వేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని డీఎస్పీ తెలిపారు.

బంగారం, వెండి చోరీ

ఆకివీడు, ఆగస్టు 12 : తొమ్మిది కాసుల బంగారం, 400 గ్రాముల వెండి చోరీకి గురైనట్లు గుగ్గిల హసిత ఫిర్యాదు మేర ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక శ్రీరామపురానికి చెందిన గుగ్గిల రవితేజ, హసిత గత నెలలో ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్ళారు. ఆదివారం ఆకివీడులో పెళ్ళికి బంధువులు వచ్చి శ్రీరామపురం ఇంటికి వెళ్ళగా తాళం పగలుకొట్టి, బీరువాలో బట్టలు చెల్లాచెదురు కావడంతో రవితేజకు తెలియ చేసిన సంగతి తెలిసిందే. సోమవారం ఇంటి యజమానులు వచ్చి పరిశీలించి బంగారం, వెండి చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

హైవేపై అదుపు తప్పిన లారీ

సబ్బవరం, ఆగస్టు 12 : జాతీయ రహదారి సబ్బవరం పెదనాయుడు పాలెం వద్ద సోమవారం ఉదయం చేపల లోడుతో ఉన్న లారీ అదుపు తప్పి ఆగి ఉన్న మరో లారీని ఢీకొంది. దీంతో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. హైవే మొబైల్ ఏఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. తాడిపల్లిగూడెం నుంచి చేపల లోడుతో ఓ లారీ అసోం రాష్ట్రం గౌహతికి బయలుదేరింది. జాతీయ రహదారి పెదనాయుడుపాలెం వద్ద ముందు వెళుతున్న ట్యాంకర్‌ను ఓవర్ టేక్ చేసి ఆగి ఉన్న మరో క్వారీ లారీని ఢీకొంది. దీంతో క్వారీ లారీ బోల్తా పడింది. చేపల లోడ్‌తో ఉన్న లారీ కేబిన్ నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ కేబిన్‌లో ఇరుక్కుపోయాడు. హైవే మొబైల్ పోలీసులు అతికష్టమ్మీద అతనిని బయటకు తీసి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. క్రేన్ సహాయంతో లారీని పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు భోజనం సక్రమంగా అందించడం లేదు


వడ్డించిన అన్నం, కూర

ఏలూరు రూరల్, ఆగస్టు 12: ముసునూరు ఏపీఆర్ఎస్‌జీఎస్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ప్రతిరోజూ మెనూప్రకారం భోజనం వడ్డించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. మెనూలో తరచూ గుడ్డు, అరటిపండు, చిక్కీ పెట్టకుండా ఆపేస్తున్నారని, పాఠశాల డిప్యూటీ వార్డెన్ కూరగాయల బిల్లులు టెండర్లు కాకుండా ఇష్టం వచ్చినట్లు రాసుకుంటున్నట్లు ఫిర్యాదు చేశారు. గతనెల అన్నంలో పురుగులు ఉండడం వల్ల పిల్లలు తినడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పాఠశాలలో చదవలేమంటూ తమ పిల్లలు ప్రతిరోజూ ఏడుస్తున్నారని ఫిర్యాదు చేశారు. సమస్యలను విద్యా కమిటీ చైర్మన్ సమావేశంలో తెలియచేసినా సమాధానం చెప్పలేదన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సీహెచ్ కీర్తన, యు.హారిక, లావణ్య, విజయ ఉన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి



డీసీసీబీ వద్ద సీపీఐ కార్యకర్తల ధర్నా

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 12: జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో తొలగించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో సంఘ నాయకులు అందచేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 34 శాఖల్లో 55 మంది అటెండర్లను అకారణంగా తొలగించడం దారుణమన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వేటు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి వారిని ఉద్యోగాల్లో చేర్చుకోకపోతే ఆందోళన చేస్తామన్నారు. కొంపల్లి కృష్ణమాచార్యులు, ఉప్పులూరి హేమశంకర్, మావూరి విజయ్, ఎంహెచ్.హకిం, కొల్లూరి సుధారాణి, భజంత్రి శ్రీనివాసరావు, నాగం అచ్యుత్, కుమార్, సూరిబాబు, శివ, హేమలత, మాలతి, నళిని, లక్ష్మి, మంగ తాయారు, శిరీష, అంజిబాబు పాల్గొన్నారు.

తాడిపూడి కాల్వ పనులు పూర్తి చేయాలి

ఏలూరు రూరల్, ఆగస్టు 12: తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువ పనులు పూర్తిచేసి రైతులకు సాగు నీరందించాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. రైతుసంఘం జిల్లా నాయకులు, ఆయకట్టు రైతులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో తాడిపూడి ఎత్తిపోతల పథకం ఉందన్నారు. ద్వారకాతిరుమల, దెందులూరు మండలాల్లో కాలువల పనులు పూర్తి చేయకపోవడం వల్ల రైతులకు సాగునీరు అందడం లేదన్నారు. రైతులకు ప్రయోజనకరంగా లేదన్నారు. తక్షణం భూసేకరణ సందర్భంగా రైతులకు ఇవ్వాల్సిన పరిహారం సమస్యలు పరిష్కరించాలని కోరారు. కట్టా భాస్కర్‌రావు, మురళీకృష్ణ, జి.గోపాలం, సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు మెరుగైన విధానం రూపొందించాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 12: రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన విధానాన్ని రూపొందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఏలూరు వచ్చిన మంత్రి నాదెండ్ల మనోహర్‌కు శ్రీనివాస్ సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పంట పండించడం కంటే అమ్ముకోవడానికి రైతు ఎక్కువ కష్టపడాల్సి వస్తుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల్లో పంటను అన్నదాత నష్టపోవాల్సి వస్తుందన్నారు. సామూహిక కల్లాలు, గ్రామీణ ప్రాంతాల్లో పంట నిల్వ చేసుకునేందుకు షెడ్లు నిర్మించాలని కోరారు. ఆయన వెంట రైతు సంఘ నాయకులు కట్టా సుబ్బారావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


సదస్సులో మాట్లాడుతున్న రత్నప్రసాద్

బుట్టాయగూడెం, ఆగస్టు 12: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జిల్లా సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ అన్నారు. సోమవారం పులిరాముడుగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. ఐదు చట్టాలపై విద్యార్థులకు జడ్జి అవగాహన కల్పించారు. ముందుగా మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జడ్జి ప్రారంభించారు. ఏజెన్సీ అటవీ ప్రాంతాల్లో మారుమూల ప్రాంతాల్లో నివాసాలు ఉంటున్న ఆదివాసీలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. గిరిజన హక్కులు, సంక్షేమ పథకాలు, న్యాయ సేవాధికార సంస్థలందించే ఉచిత న్యాయ సేవలపైన అవగాహన కల్పించారు. ముంజులూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనం, పీఆర్ గూడెం గిరిజన ఆశ్రమ బాలుర వసతిగృహంలో భోజనం పరిశీలించారు. ఎం.శ్రీనివాసరావు, యు.ఏసుబాబు, ఏవీవీ.భువనేశ్వరి, ఎం. క్రాంతికుమార్, మేకల రామ్మోహనరావు, ఎం.నాగులు, పి.పెద్దిరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యశ్రీ, వైద్యులు శ్వేత, హెచ్ఎం వెంకటేశ్వరావు, ఉపాధ్యాయులు, అంగనవాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది

భీమడోలు, ఆగస్టు 12: యువత మాదక ద్రవ్యాల బారినపడకుండా కళాశాలలు, పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయ, అధ్యాపక సిబ్బంది అవగాహన కల్పించాలని సీఐ రవికుమార్, ఎక్సైజ్ సీఐ గిరిజ కుమారి సూచించారు. నవయుక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా భీమడోలులో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన 14500 టోల్ ఫ్రీనెంబర్‌కు ఫోన్ చేసి అవగాహన కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో భీమడోలు ఎస్ఐ సుధాకర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

● కామవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన మత్తు పదార్థాల వలన దుష్పరిణామాలపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అధ్యాపకులు ఇందిరాకుమారి, దారావతు మల్లేష్, ఎం.విజయకృష్ణ, పి.ఏడుకొండలు, అన్నపూర్ణమ్మ, రత్నసిరి, ఆర్.కుమార్‌రాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

'మా భూములు సాగు చేసుకోనివ్వండి'


తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా

జీలుగుమిల్లి, ఆగస్టు 12: మా భూములు సాగు చేసుకోనివ్వాలంటూ నిర్వాసితులు ఆందోళన చేశారు. పోలవరం నిర్వాసితులు పి.నారాయణపురం రెవెన్యు పరిధిలో భూములు సాగు చెయకుండా అడ్డుకుంటున్నారని సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద కొద్దిసేపు ధర్నా చేశారు. 115 ఎకరాలు తమకు ప్రభుత్వం కేటాయించి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చిందన్నారు. భూములు దున్నుతుంటే వీఆర్వో ముత్యం అడ్డుకుంటున్నారని, తమ భూములపై అభ్యంతరం ఉంటే పాస్ పుస్తకాలు వెనక్కి తీసుకుని ప్రభుత్వం తమకు న్యాయం చెయ్యాలని వారు కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సర్వం త్యాగం చేసిన తమను ప్రభుత్వం పట్టించుకోవాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు సదీప్‌కు వినతిపత్రం అందజేశారు. శివగిరి గాజుల గొంది, చీడూరు, కొరుటూరు, కట్కూరు గ్రామాలకు చెందిన వారు అరగంటి రాములమ్మ, కోటం పండుదొర, ఎస్.రాజేష్, కోటం నరసింహ ఉన్నారు.

వరి నాట్లు పీకేశారు

బుట్టాయగూడెం, ఆగస్టు 12: గిరిజనులు ఎల్‌టీఆర్, 1/70 చట్టం భూముల్లో వరి నాట్లు పీకేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. బుట్టాయగూడెంలో జరిగిన కార్యక్రమంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మర్లగూడెంకు చెందిన గిరిజనుల వరి పంటను జంగారెడ్డిగూడెంకు చెందిన గిరిజనేతరుడు పీకివేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో తామా ముత్యాలమ్మ, ఉడతా వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

చెరువు నీరు వృథా

● రోడ్డుపై వేగిలింగేశ్వరస్వామి చెరువు అదనపు జలాలు ● మునిగిన వెలమ కాలనీ


ప్రధాన రోడ్డుపై చేరిన చెరువు నీరు


చెరువు నుంచి తూముద్వారా వృథాగా పోతున్న నీరు

చింతలపూడి, ఆగస్టు 12: పట్టణ నడిబొడ్డున ఉన్న వేగిలింగేశ్వరస్వామి చెరువు నుంచి అదనపు జలాలు రోడ్డుపై చేరుతున్నాయి. తూము వద్ద సొరంగంలా ఏర్పడడంతో నీరు వృథాగా పోతోంది. నీరంతా రోడ్డుపై చేరడంతో చెరువును తలపిస్తోంది. మరోవైపు సమీపంలోని వెలమపేట కాలనీ నీట మునిగింది. సాగునీటి చెరువు అయినప్పటికి దిగువన ప్రస్తుతం సాగు భూములు లేవు. భూములన్నీ గృహాలుగా, అనధికార లేఅవుట్లుగా మారిపోవడంతో సాగు పూర్తిగా తగ్గిపోయింది. దీనితో చెరువు నిర్వహణ గాలికొదిలేశారు. వృథాగా పోతున్న నీరు రోడ్డుపై చేరడంతో గోతులతో అధ్వానంగా మారింది. గతంలో భారీ గోతుల్లో లారీలు దిగబడడంతో ఇటీవల గోతులు పూడ్చారు. మళ్లీ చెరువు నీరుతో రోడ్డంతా పాడవుతోంది. నీరంతా వృధాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నీటిపారుదల శాఖకు చెందిన చెరువుకు మున్సిపల్ అధికారులు చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ పేరిట లక్షలు ఖర్చుచేసి తడికెలు నిర్మించారు. చెరువులో చేపలు పెంచడానికి మున్సిపల్ అధికారులు అనుమతి ఇస్తుంటారు. మున్సిపల్ అధికారులైనా చెరువు తూము కట్టడికి చర్యలు తీసుకోలేదు. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చెరువు వెనుక ఆక్రమణలు, అలుగుపోయే మార్గంలో ఆక్రమణలు, చెరువుకట్టపై ఆక్రమణలను సైతం అధికారులు పట్టించుకోవడం లేదు. ఆక్రమణదారులు కూడా నీరు వృథా కావడాన్ని నిరోధించడం లేదు. అధికారుల దృష్టికి తీసుకువెళితే ఆక్రమణలపై చర్యలు తీసుకుంటారని మిన్నకుండిపోతున్నారు. చెరువు నీరు వృథా పోకుండా కాపాడుకోవాలి. ఈ బాధ్యత ఎవరిదో మున్సిపల్, ఇరిగేషన్ అధికారులే తేల్చాలని, చెరువు, రోడ్డును పరిరక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.





ద్వారకాతిరుమల, ఉంగుటూరు, లింగపాలెంలో అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

పని సర్దుబాటుపై ఉపాధ్యాయుల నిరసన

ఉంగుటూరు, ఆగస్టు 12: ప్రభుత్వం విధి విధానాలను సరైన రీతిలో పొందుపరచకుండా పని సర్దుబాటు నిర్వహిస్తున్నారంటూ ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. పని సర్దుబాటు విషయంలో తగిన రీతిలో ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయలేదని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉసుముల రాంబాబు, డాకి జోగి నాయుడు సోమవారం ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పని సర్దుబాటును బహిష్కరిస్తున్నామని డీవైఈవో రవీంద్ర భారతికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీహెచ్.శ్రీధర్, కార్యదర్శి కె.ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

● లింగపాలెం: ఉపాధ్యాయుల పని సర్దుబాటులో గత ప్రభుత్వ విధానాన్ని కూటమి ప్రభుత్వం అనుసరిస్తుందని ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకులు ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన జీవో రద్దుచేయాలని, తెలుగు మీడియం తీసుకురావాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాలను చర్చల తరువాతే బదిలీలు చేయాలని, సర్దుబాట్లు పేరుతో ఉపాధ్యాయులను బదిలీ చేసేందుకు కౌన్సెలింగ్ అన్యాయం అన్నారు. ఎంఈవో కె.రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘ నేతలు అప్పలస్వామి, సొంగా నాగేశ్వరరావు, చందమాల సాల్మన్ రాజు, సరికొండ రమేష్, స్వామి, కలపాల సురేష్ పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: మండల స్థాయిలో పని సర్దుబాటును బాయ్‌కాట్ చేస్తూ యూటీఎఫ్ నేతలు ఎంఈవో-2 పరసా వెంకట్రావుకు సోమవారం నోటీసు అందజేశారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రం వద్ద ఆయనను ఏపీ యూటీఎఫ్ జిల్లా నేత గెద్దం దేవానందరావు, మండల కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాసరావు తదితరులు కలసి ఫ్యాప్టో పిలుపు మేరకు ఈ నోటీసు అందజేస్తున్నట్లు చెప్పారు.

విజృంభిస్తున్న డెంగీ జ్వరాలు

టి.నరసాపురం, ఆగస్టు 12: రుద్రకోటరాజుగూడెంలో డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే కొందరు జంగారెడ్డిగూడెం ప్రవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రుద్రకోట రాజుగూడెంలో ఒక యువకుడు గత శనివారం జ్వరం రావడంతో జంగారెడ్డిగూడెం ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు చేసి డెంగీగా నిర్ధారణ చేశారని ప్లేట్ లెట్ కౌంట్స్ తగ్గాయని చెబుతున్నారు. గ్రామంలో డెంగీ జ్వరాలు ఉండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో వైద్య సేవలు అందించాలని పారిశుద్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి


విద్యార్థులకు ప్రోత్సాహకాల పంపిణీ

ఏలూరు టూటౌన్, ఆగస్టు 12: విశ్వ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బడేటి చంటి హామీ ఇచ్చారు. రెవెన్యూ భవన్‌లో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం వార్షికోత్సవంలో సోమవారం వారు మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీ భరోసా ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామంజనేయ చౌదరి జ్యోతిప్రజ్వలన చేశారు. సంఘ అధ్యక్షుడు శివశ్రీ మాట్లాడుతూ విశ్వబ్రహ్మణుల ఉత్తర క్రియలు నిర్వహించుకోవడానికి శాశ్వత భవనం నిర్మించుకోవాలన్నారు. బులియన్ మర్చంట్ అసోసియేషన్ చైర్మన్ కె.రాంబాబు, తాతారావు, శ్రీనివాసరావు, కే.సత్యనారాయణ, శివరావు, సోమాచార్యులు, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

కులగణనకు 'తిరమలై కల్లర్ల' వినతి

ఏలూరు రూరల్, ఆగస్టు 12: తమిళనాడు నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి 80 ఏళ్లగా వివిధ ప్రాంతాల్లో జీవిస్తున్న తిరుమలై కల్లర్ కులస్తుల కులగణన చేపట్టాలని కోరారు. తిరుమలై కల్లర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.ఈశ్వర్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో తమ కులస్తులు తినుబండారాలు తయారు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. వారి పిల్లల చదువులకు కులధ్రువీకరణ పత్రం లేనందున ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పూర్తిస్థాయిలో సేకరించిన సమాచారాన్ని బీసీ కమిషన్‌కు తెలపాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో చిన్నస్వామి, మనోహర్, ఉదయ్‌కుమార్, కార్తీక్, సురేష్, రమేష్, కె.ప్రభు, భాస్కర్ పాల్గొన్నారు.

వట్లూరులో చర్చితో ఇబ్బందులు

ఏలూరు రూరల్, ఆగస్టు 12: వట్లూరులో హిందువులు నివసిస్తున్న ప్రాంతంలో కేరళ పాస్టర్ అక్రమంగా చర్చి నిర్మాణం చేసి ప్రార్థనల పేరుతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్కడ ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని కోరుతూ హౌసింగ్‌బోర్డు కాలనీవాసులు, హిందూ సంఘాల జేఏసీ సభ్యు లు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా పాస్టర్ హిందూ దేవతలను దూషిస్తున్నారని ఆరోపించారు. బలవంతంగా మత మార్పిడికి పాల్పడుతున్నాడని మండిపడ్డారు. పాస్టర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, అనుమతిలేని చర్చి కార్యకలాపాలు నిలుపుదల చేయాలని కోరారు. రామనపూడి శివప్రసాద్, కాగిత శ్రీనివాస్, ఎం.వి సత్యనారాయణ, ఎ.శ్రీనివాసరావు, సరస్వతి, లక్ష్మి, వెంకటరత్నం పాల్గొన్నారు.

రేపు ఇంటర్ ఉత్తీర్ణులకు జాబ్‌మేళా

ఏలూరు అర్బన్, ఆగస్టు 12: ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కంపెనీలో డిజిటల్ ప్రాసెసింగ్ అసోసియేట్ ఉద్యోగావకాశాలకోసం ఈ నెల 14న వట్లూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఇంటర్‌బోర్డు ఆర్ఐవో చంద్రశేఖరబాబు సోమవారం తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, ఎంఈసీ 75శాతం మార్కులతో పూర్తిచేసిన విద్యార్థులు అర్హులని వివరించారు. బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులు చదివిన విద్యార్థులు అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి డీపీవో విభాగంలో ఉద్యోగావకాశాలు పొందవచ్చునన్నారు. వివరాలకు 96429 73350, 85550 85030 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

జీవ వైవిధ్యంపై విద్యార్థులకు పోటీలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 12: ఏపీ జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో 'జీవవైవిద్యాన్ని కాపాడటంలో యువతపాత్ర' అంశంపై కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం జిల్లాస్థాయి వక్తృత్వం, చర్చాగోష్ఠి, లఘుచిత్ర ప్రదర్శన పోటీలు జరిగాయి. వివిధ మండలాల నుంచి 79 మంది విద్యార్థులు హాజరయ్యారని ఏపీ నేషనల్ గ్రీన్‌కోర్(ఎన్జీసీ) జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. వక్తృత్వ పోటీలో వై.దివ్యశ్రీ, టి.హస్యసుమ, పి.జెస్సికా (అందరూ ఏలూరువారే) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. డిబేట్‌లో పి.ఎలీషా కెజియా, బి.శ్వేతశ్రీ, పి.నీరజలక్ష్మీ దయాళ్, లఘుచిత్రం పోటీలో పి.మౌనిక (పల్లెర్లమూడి), డి.కుసుమ, బీడీఎస్.ఎల్.ప్రసన్న(క్రైకరం) విజేతలుగా నిలిచారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో బహుమతులు అందజేస్తారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు, శ్రీనివాస్, రమాదేవి, గంగాధర్, మల్లికార్జున్, రామలక్ష్మి వ్యవహరించారు.

అంతర్జాతీయ యువజన దినోత్సవం

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 12: ఏపీ యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించారు. స్ఫూర్తి రూరల్ డవలప్‌మెంట్ ఎడ్యుకేషనల్ సొసైటీ రామవాపురం సహకారంతో నిర్వహించినట్టు సెట్‌వెల్ సీఈవో సి.మధుభూషణరావు తెలిపారు. మానవత చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, దేవినేని భాస్కరరావు పాల్గొన్నారు. విద్యార్థులకు క్లిక్ టు ప్రోగ్రెస్ 2024నకు థీమ్‌గా ప్రకటించింది. కార్యక్రమంపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఎస్.కె.బాషా సర్టిఫికెట్లు, మెమెంటోలు అందచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వరరావు, జి.ప్రవీణ్‌కృష్ణ, ఘంటా సుధాకర్, పీవీఎన్.సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు విడుదల చేయాలి

బుట్టాయగూడెం, ఆగస్టు 12: ఉపాధి కూలీలకు వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద కూలీలు ఆందోళన చేశారు. నాలుగు నెలలుగా కూలీలకు వేతన బకాయిలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బి.డేవిడ్‌రాజు, వై.రాజ్, ఎం.వెంకటేశ్వరావు, టి.సామ్యూల్, బి.విజయరాజు పాల్గొన్నారు.

● కుక్కునూరు: ఉపాధి కూలీలకు వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని పెదరావిగూడెం సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఉపాధి కూలీలకు 200రోజులు పని దినాలు కల్పించి దినసరి వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేసవి నుంచి ఇప్పటి వరకు చేసిన పనులకు పెండింగ్ లేకుండా బకాయిలన్నింటిని చెల్లించాలన్నారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకటాచారి, కొన్నే లక్ష్మయ్య, మహిళా సభ్యులు వీ.శ్యామలా, నాగలక్ష్మి, సీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.




ఉంగుటూరు, కుక్కునూరు, చింతలపూడిలో శిక్షణ కార్యక్రమాల్లో ఎంపీపీ, ఎంపీడీవోలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు

సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలి

కామవరపుకోట, ఆగస్టు 12: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, వనరుల కల్పనకు పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో జంగం స్వర్ణభారతి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు రోజులపాటు జరగనున్న సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. మాస్టర్ ఆఫ్ ట్రైనీస్ వివిధ అంశాలపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ గెద్దం ఎలీషా, ఈవోపీఆర్‌డి మరిడయ్య శిక్షకులు జి.డి.వి.శ్రీనివాసరావు, నేతల విజయ్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

● చింతలపూడి: గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రణాళికబద్ధంగా చేస్తే ప్రతి పంచాయతీ అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో రాటాలు అన్నారు. మండలంలోని 19 పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యదర్శులు మురళి, రామ్మోహన్, కుమార్, స్వరూపరాణి శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీల విధులు, పరిపాలన, నిర్వహణ, గ్రామసభలు, పర్యవేక్షణ, మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. రెండోరోజు యర్రగుంటపల్లిలో ఫీల్డ్ విజిట్‌గా కార్యక్రమాన్ని చేపడతారని తెలిపారు. తహసీల్దార్ ప్రమద్వర, ఎంపీపీ రాంబాబు, ఈవోపీఆర్డి వాణి పాల్గొన్నారు.

● ఉంగుటూరు: సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో ముందుకు సాగాలని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీడీవో శర్మ అన్నారు. నిధులు, విధులు, రహదారులు, తాగునీరు, డ్రైనేజి, పారిశుధ్యం నిర్వహణ అంశాలపై శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. కేవీగిరిధర్, టి.ముత్తయ్య, వెంకట్రావు, విజయ్‌కుమార్, జి.సోమరాజు తదితరులు శిక్షణ ఇచ్చారు.

● కుక్కునూరు: గ్రామ పంచాయతీ విధులు, పరిపాలన అభివృద్ధి ప్రణాళిక, పారిశుధ్య నిర్వహణపై సోమవారం వెలుగు కార్యాలయంలో శిక్షణ ప్రారంభమైంది. 15 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు శిక్షణలో ఉన్నారు. ఎంపీడీవో నరసింహరావు, శిక్షకులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఎంపీడీవో కె.విజయప్రసాద్ చెప్పారు. బుధవారం వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. పగడం నాగేశ్వరావు, కె.బ్రహ్మయ్య, వై.గణేష్, పాల్కివాలా ట్రైనర్‌లుగా వచ్చారు.

● పోలవరం: మండలంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ వెంకటరెడ్డి, ఎంపీడీవో జి.శ్రీను, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ



వాహనదారులను ప్రశ్నిస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, ఆగస్టు 12: జిల్లా వ్యాప్తంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ఆదివారం అర్ధరాత్రి నిర్వహించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు, సబ్ డివిజన్ల పరిధితోపాటు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో తనిఖీలు నిర్వహించారు. రహదారి ప్రమాదాల నివారణకు వాహనదారులకు ఫేస్‌వాష్ కార్యక్రమం నిర్వహించారు. ప్రార్థనాలయాలు, బ్యాంక్ ఏటీఎంల వద్ద రాత్రి పూట పోలీసులు గస్తీ నిర్వహించి సంబంధిత ప్రాంతాల వాచ్‌మెన్‌లను అప్రమత్తం చేశారు. వాహనాలలో గంజాయి, సారా, ఖైనీ, గుట్కాలు రవాణా జరుగకుండా జాతీయ, రాష్ట్రీయ రహదారులు ఇతర రహదారుల్లో తనిఖీలు నిర్వహించారు. వాహనదారులను ప్రశ్నించారు.

పితాని సూర్యనారాయణ మృతి తీరని లోటు


నివాళులర్పిస్తున్న పీతల సూజాత, నేతలు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 12: పితాని సూర్యనారాయణ మృతి వారి కుటుంబానికి తీరని లోటని మాజీ మంత్రి పీతల సూజత అన్నారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోదరుడు సూర్యనారాయణ ఇటీవల మృతి చెందారు. మాజీ మంత్రి పీతల సుజాత స్థానిక టీడీపీ నాయకులు షేక్ ముస్తఫా తదితరులు సోమవారం పోడూరు మండలం కొమ్ముచిక్కాలలో సూర్యనారాయణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పితాని సత్యనారాయణను పరామర్శించారు. నాయకులు ఓబులనేని వెంకన్న, బాబు, యడ్లపల్లి ఏడుకొండలు ఉన్నారు.

నగర ప్రజలపై శ్రీరాముని ఆశీస్సులు ఉండాలి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 12: నగర ప్రజలపై ఎల్లవేళలా శ్రీరాముని ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి, జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పల నాయుడు ఆకాంక్షించారు. తూర్పు వీధి రామమందిరంలో నూతనంగా నిర్మించిన కారు పార్కింగ్, డైనింగ్ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం సత్యనారాయణస్వామి వ్రతం, వేంకటేశ్వరస్వామికి దీపారాధన, వినాయకుడికి ఉండ్రాళ్ళ సమర్పణ కార్యక్రమాలు జరిగాయి. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనా చౌదరి, ఆలయ ఈవో ఎం.రాధా, కమిటీ సభ్యులు సత్యకుమార్, రాము, సుబ్బారావు, సుధాకర్, భద్రం, జనసేన జనసేన నాయకులు శ్రావణ్‌కుమార్ గుప్తా , తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘ సొమ్ము స్వాహా చేసిన వీవోఏ

ద్వారకాతిరుమల, ఆగస్టు 12: మహిళల స్వయం సహాయక సంఘం నుంచి వీఓఏ రూ.28 వేలు స్వాహా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలో చాందినీ గ్రూపు సభ్యులు తీసుకున్న శ్రీనిధి రుణం నిమిత్తం గ్రూపు సభ్యుల నుంచి వీవోఏగా పనిచేస్తున్న పెండ్లి సామ్రాజ్యం ప్రతీ నెల కొంత సొమ్మును రికవరీ చేసింది. సుమారు రూ.28 వేలు శ్రీనిధి సొమ్మును ఖాతాలో జమ చేయకుండా స్వాహా చేసింది. అనుమానం వచ్చిన గ్రూపు సభ్యులు ఆన్‌లైన్‌లో పరిశీలించడంతో విషయం బయటపడింది. గ్రూపు సభ్యులు సీసీ నిర్మలకు ఫిర్యాదు చేశారు. ఆమె సోమవారం విచారణ జరిపి వీఏఈ సామ్రాజ్యం నుంచి సొమ్ము రికవరీ చేసి గ్రూపు సభ్యులకు ఇప్పించారు. సీసీ నిర్మల వివరణ కోరగా సమస్య పరిష్కారమైందన్నారు.

ప్రజారోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

లింగపాలెం, ఆగస్టు 12: ప్రజారోగ్యంపై అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ ముసునూరు వెంకటలక్ష్మి అన్నారు. మండల పరిషత్ సమావేశం వెంకటలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగింది. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. గ్రామాల్లో రక్షిత తాగునీరు అందించడానికి, పారిశుధ్యం మెరుగుదలకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించారు. అనంతరం పలువురు సభ్యులు ప్రస్తావించిన సమస్యలకు సంబంధితశాఖల అధికారులు సమాధానం చెప్పారు. ఎంపీడీవో ఒరుదు రాంబాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూటౌన్ :** వయనాడ్ బాధితుల సహాయం కోసం విరాళాల సేకరణ జరుగుతుందని ఐద్వా జిల్లా కార్యదర్శి శ్యామలరాణి తెలిపారు. ఆగిరిపల్లి లో సోమవారం రూ.3వేలు సేకరించామన్నారు.
- గౌరీ పరమేశ్వర ఆలయ ప్రాంగణంలో గంగానమ్మకు సోమవారం భక్తులు 108 రకాల పిండి వంటలతో సారె సమర్పించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- **లింగపాలెం :** ఎంపీడీవో బదిలీ కావడంతో కార్యాలయ సిబ్బంది సన్మానం చేశారు. ఎంపీడీవో రాంబాబు సిబ్బందిని సమన్వయం చేసుకుని పనిచేశారన్నారు.
- **నిడమర్రు :** స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సర్వోదయమండలి ఆధ్వర్యంలో గాంధీ మండపాల వద్ద ఫ్రీడం ర్యాలీ, శాంతి పదర్శనలు నిర్వహిస్తామని జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. స్వాతంత్ర సమరయోధులకు, సేవాతత్పరులకు పురస్కారాలు అందజేస్తామని ఆయన తెలిపారు.
- నిడమర్రు బాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో విఖనస మహాముని జయంతి నిర్వహించారు. వైఖానస శాఖీయులు స్వామి వారికి లక్ష తులసీ పూజ నిర్వహించారు. స్వామి వారి గురుడసేవా శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు.
- **ద్వారకాతిరుమల :** ఎంఈవో సోమవారం బాధ్యతలు చేపట్టిన డి.సుబ్బారావును యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నేతలు కలసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి, దుశ్శాలువతో సత్కరించారు. ఎంఈవో-2 పరసా వెంకట్రావు, గెద్దం దేవానందరావు, కట్టా శ్రీనివాసరావు, కె.ప్రభాకర్, కె.రాజారావు, టి.రాంబాబు, జి.నాగేశ్వరరావు, నీలి శ్రీనివాస్ పాల్గొన్నారు.
- **జీలుగుమిల్లి :** దర్భగూడెం ఆర్‌సీఎం స్కూల్ వద్ద కూటమి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆశ్రం ఆస్పత్రి వైద్యులు 197మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. పది మందికి ఆపరేషన్ నిమిత్తం ఆశ్రంకు రిఫర్ చేశారు. బి.రాజబాబు, టి.సాంబ, బి.చిరంజీవి ఉన్నారు.
- **జంగారెడ్డిగూడెం :** ఈ నెల 16 నుంచి గ్రామ పంచాయతీల్లో రెవెన్యు సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దారు కె.స్లివజోజి చెప్పారు. మండలంలో 21 గ్రామ పంచాయితీలు జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో భూ సమస్యలపై ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు.





ముదినేపల్లిలో సర్దుబాటు కౌన్సెలింగ్ బహిష్కరించి ఉపాధ్యాయుల నిరసన.. ఆగిరిపల్లిలో తహసీల్దార్‌కి వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో.. ముసునూరులో ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

సర్దుబాటు వద్దు

ఉపాధ్యాయుల నిరసన

ముదినేపల్లి, ఆగస్టు 12 : ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యా వ్యవస్థకు గొడ్డలి పెట్టులాంటి 117 జీవోను రద్దు చేయాలని, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ముదినేపల్లిలో సోమవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కౌన్సెలింగ్‌ను మండలంలోని ఉపాధ్యాయులు బహిష్కరించి స్థానిక మండల రిసోర్స్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వం జారీ చేసిన 117 జీవోను రద్దు చేయకుండా ఉపాధ్యాయుల పని సర్దుబాటును అంగీకరించేది లేదని ఏపీటీఎఫ్, యూటీఎఫ్, ఎస్‌టీయూ నాయకులు బేతాళ రాజేంద్ర ప్రసాద్, నరసింహారావు, సాయిలక్ష్మి, దుర్గా ప్రసాద్, గణేష్‌బాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. ఎస్జీటీలతో పాటు అర్హులైన టీచర్లకు ప్రమోషన్లు చేపట్టకుండా పని సర్దుబాటు చేయటం నిబంధనలకు విరుద్ధమని నిరసన వ్యక్తం చేశారు. జీవో 117 వల్ల గత ప్రభుత్వం 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయటం వల్లే విద్యారంగంలో పలు సమస్యలు తలెత్తాయని ఏపీటీఎఫ్ నాయకుడు రాజేంద్ర ప్రసాద్ విమర్శించారు. ఎస్జీటీలకు ప్రమోషన్లు ఇచ్చి యూపీ స్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత నివారించాలని డిమాండ్ చేశారు.

కలిదిండి: కలిదిండి విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం చేపట్టిన ఉపాధ్యాయుల పని సర్దుబాటును ఫ్యాప్టో బహిష్కరించింది. దీంతో ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ నిలిచిపోయింది. జీవో 117ను రద్దు చేయాలని ఫ్యాప్టో సంఘాల ఉపాధ్యాయుల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీవైఈవో, కలిదిండి ఇన్‌చార్జ్ ఎంఈవో ఎ.రవి ప్రకాష్ మాట్లాడుతూ ఏలూరు డివిజన్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను రెండు రోజుల్లో పని సర్దుబాటు ప్రక్రియ ద్వారా భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ముసునూరు: ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చించి, సరైన విధానంలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని, అప్పటి వరకు నిలిపివేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య మండల నాయకులు కాసాని గాంగేయుడు, జి.పద్మకిషోర్ కోరారు. సోమవారం ముసునూరులో ఎంఈవో సుబ్బారావుకు నాయకులు వినతపత్రం అందజేశారు. 70 శాతం పైబడి దివ్యాంగులైన ఉపాధ్యాయులను పని సర్దుబాటు నుంచి మినహాయించాలని, ప్రైమరీ స్కూల్ హెడ్మాష్టర్ పోస్టులను విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏఫ్‌ఏపీటీవో నాయకులు ఎం.కళాధర్, కె.బాబురావు, బి.వెంకటేశ్వరరావు, ఎం.ఫ్రాన్సిస్, ఏ.పుల్లయ్య, జి.రాంబాబు, పి.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఫ్యాప్టో ఆగిరిపల్లి మండల నాయకులు ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎస్టీయూ నాయకుడు తాడి నరసింహారావు మాట్లాడుతూ వర్క్ అడ్జస్ట్‌మెంట్ తక్షణమే నిలుపుదల చేయాలని కోరారు. యూటీఎఫ్ నాయకుడు కె.అజరయ్య మాట్లాడుతూ జీవో 117 రద్దుచేసి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు.

48 గంటల్లోనే ధాన్యం సొమ్ము జమ

రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

ఏలూరు సిటీ, ఆగస్టు 12 : ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లోనే సొమ్ము జమ చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. స్థానిక సీఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో సోమవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రైతులకు ధాన్యం కొనుగోలు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. 35,374 మంది రైతులకు ధాన్యం సొమ్ము రూ.674.43 కోట్లు చెల్లింపు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిం మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే రూ.వెయ్యి కోట్ల బకాయిలు చెల్లించిందని, మిగిలిన రూ.674 కోట్లు సోమవారం నాడు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే రూ.472 కోట్ల ధాన్యం బకాయిల సొమ్మును రైతులకు చెల్లిస్తున్నామని చెప్పారు. రైతులకు 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు అందజేస్తామన్నారు. పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వం ఉచితంగా చెల్లించే యోచన ఉందన్నారు. గత ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేదని ఆయన విమర్శించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు రైతుల సమస్యలను అసెంబ్లీ దృష్టికి తెచ్చారన్నారు. ఈ నెల 16 నుంచి నిర్వహించే గ్రామసభల్లో కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందజేస్తామన్నారు. వరి పండించే రైతులు ఈ-పంట ద్వారా రైతు సహాయక కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో వేర్‌హౌస్ గోదాములు ఏర్పాటుకు కేంద్రం నిధులు మంజూరు చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గత రబీలో రెండు లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 17,496 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. అయితే రైతులకు సుమారు రూ.200 కోట్లు చెల్లించాల్సి ఉండగా నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలుత రూ. 153 కోట్లు చెల్లించామని, సోమవారం రూ. 47.53 కోట్లు 2,116 మంది రైతుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండ్యన్ మాట్లాడుతూ గత రబీలో 12.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి తీసుకున్నామన్నారు. ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ గిట్టుబాటు ధర కల్పించే దిశగా కృషి చేస్తోందన్నారు. కైకలూరు, తాడేపల్లిగూడెం, దెందులూరు ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, బొలిశెట్టి శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ముందస్తుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. కౌలు రైతులకు సకాలంలో సొమ్ము బకాయిలు విడుదల చేసిన ప్రభుత్వానికి ఆయన అభినందనలు తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య, సొంగా రోషన్ కుమార్, సిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, జేసీ పి.ధాత్రిరెడ్డి, ఉమ్మడి పశ్చిమ పౌరసరఫరాల శాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు

మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. డీలర్లకు న్యాయం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారని రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు రామకృష్ణ, ఉదయేశ్వరరావు, మాణిక్యాలరావు, ప్రసాద్, వీర్రాజు, దుర్గారావు, డేనియల్‌రాజు, రాజకుమార్ , రాజేశ్వరి పాల్గొన్నారు.



దేవుడి పటంతో పాటు అక్కడున్న ఓ రాయికి పూజ చేసిన దృశ్యం

గుప్త నిధుల కోసం తవ్వకాలు

- ద్వారకాతిరుమలలో కలకలం
- గోతులు తీసిన ఆనవాలు, దేవుడి ఫొటోలకు పూజలు
- భయాందోళనలో స్థానికులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 12: ద్వారకాతిరుమల కుచ్చెలమెట్టపై గుప్తనిధుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి వేళ జరుపుతున్న తవ్వకాలు కలకలాన్ని రేపుతున్నాయి. వారం రోజులుగా రెండు రోజులకోసారి ఇలా తవ్వకాలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. నృశింహసాగరం సమీపంలో నిర్మానుష్యంగా ఉండే కుచ్చెలమెట్టపై రాత్రివేళ లైట్లు వేసుకుని..... పలుగులతో తవ్వకాలు జరిపే శబ్దాలు విని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఆ కుచ్చలమెట్టపై పురాతన మండపం ఉండేదని, క్షీరాబ్దిద్వాదశి పర్వదినాన తెప్పోత్సవం నిమిత్తం సాగరం వద్దకు వచ్చే స్వామి, అమ్మవార్లు ముందుగా ఈ మండపం వద్దకు వెళ్లేవారని పెద్దలు చెబుతున్నారు. అయితే ఈ మండపం శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ మెట్టపైకి ఎవరూ వెళ్లలేదని వారు అంటున్నారు. అయితే గతంలో కొందరు వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపేవారన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరలా తాజాగా వారం రోజుల నుంచి ఈ ప్రాంతంలో జరుపుతున్న తవ్వకాలు ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. ఈ క్రమంలో కొందరు గ్రామస్థులు సోమవారం అక్కడకు వెళ్లి పరిశీలించగా ఆ ప్రాంతంలో పలు చోట్ల రాళ్లకు పసుపు, కుంకుమలు, దేవుని ఫోటోలను ఉంచి పూజలు చేయడంతో పాటు పెద్ద గొయ్యి తీసిన ఆనవాలు ఉందని.. అటుగా వెళ్లాలంటేనే భయమేస్తోందని వారు అంటున్నారు. గుప్త నిధుల తవ్వకాలు జరుపుతున్న వారిని గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

క్రైం సమాచారం

బైక్ దొంగల అరెస్టు

ముదినేపల్లి, ఆగస్టు 12: ముదినేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల పలు దొంగతనాల్లో నిందితులను అరెస్టు చేసి వారి నుంచి సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తపల్లి గ్రామంలో ట్రాక్టర్ టైర్లు, పలు చోట్ల నాలుగు మోటార్ బైక్‌లను దొంగిలించిన కేసులో నిందితులైన పెడన మండలం ఉరివి గ్రామానికి చెందిన జల్లూరి మణికంఠ, పామర్రుకు చెందిన కొట్టి సాయిరామ్‌లను సోమవారం కొత్తపల్లి కాలనీ బస్ షెల్టర్ వద్ద ఎస్ఐ వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. వీరిని కైకలూరు కోర్టులో హాజరు పర్చామని ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి.. నలుగురి అరెస్ట్

చాట్రాయి, ఆగస్టు 12: మండలంలోని బూరుగ్గూడెంలో పేకాట శిబిరంపై సోమవారం రాత్రి దాడి చేసి నలుగురు జూదరులను అరెస్ట్ చేసి, రూ. 73,900 నగదు, 2 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు. ఎక్కడైనా పేకాట, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని. ఎక్కడైనా ఇవి జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇచ్చి ప్రజలు సహకరించాలని ఎస్సై కోరారు.





కైకలూరు, కలిదిండిలలో హిందూ సంఘాల శాంతియుత నిరసన ర్యాలీ

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు హేయం

కైకలూరు, ఆగస్టు 12: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు హేయమని న్యాయవాది మేడిశెట్టి పాములు అన్నారు. సోమవారం కైకలూరు గాంధీబొమ్మ సెంటర్ నుంచి జాతీయ రహదారి వెంబడి వందలాది మంది హిందువులు నినాదాలు చేస్తూ మాగంటి థియేటర్ వరకు ర్యాలీగా వెళ్లారు. బంగ్లాదేశ్‌లో అమాయకులైన హిందువులను హింసిస్తున్నారని దీనిని ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. బీజేపీ నాయకులు కీర్తి వెంకటరాం ప్రసాద్, బొల్లా శ్యామలరాజు గౌడ్, సాయిగిరి, హిందూ సంఘాలు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కలిదిండి: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండిస్తూ సోమవారం కలిదిండిలో హిందూ సంఘాల నాయకులు ధర్నా చేశారు. హిందువులపై దాడులను అరికట్టాలని నినాదాలు చేశారు. హిందూ సంఘాల నాయకులు నంబూరి బాండు రాజు, పెరుమాళ్ల వెంకటేశ్వరరావు, కోకా శ్రీనివాస్, చక్కా జగన్, కోకా రమేష్, పేటేటి వెంకట భోగేశ్వరరావు, వెంకట రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు చలసాని వెంకట రామారావు

అటవీ బంజరు భూములకు పట్టాలివ్వాలి

ముసునూరు, ఆగస్టు 12: అటవీ బంజరు భూముల్లో పేద, బలహీన వర్గాల సాగుదారులకు ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. సోమవారం వేల్పుచర్లలో జరిగిన సాగుదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గం పరిధిలో ఉన్న అటవీ బంజరు భూములను గత 50 ఏళ్ళుగా పేదలు సాగు చేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన వారికి పట్టాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు చాట్ల పుల్లారావు, అబ్బూరి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించండి

ముసునూరు, ఆగస్టు 12: సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించి, రైతులు అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్ అన్నారు. సోమవారం చెక్కపల్లిలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు సూచించిన మేరకు ఎరువులు, పురుగుమందులు వాడి నాణ్యమైన దిగుబడులు సాధించాలన్నారు. ఈ దిగుబడులను రాష్ట్ర ఆర్గానిక్ ప్రోడక్ట్స్ సర్టిఫికేషన్ సంస్థ ద్వారా ధ్రువీకరించి సర్టిఫికెట్‌ను అందజేస్తామన్నారు. ఈ సర్టిఫికెట్ ద్వారా మార్కెటింగ్ అవకాశాలను పెంపొందించుకుని, బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలను పొందవచ్చని ఏవో వివరించారు. ఏఫ్‌పీవో అధ్యక్షులు చిలుకూరి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, ఏఈవో రాయకృష్ణ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.



బాల్య వివాహాలు అనర్థం

మండవల్లి ఆగస్టు 12: బాల్య వివాహాలు అనర్థమని ఐసీడీఎస్ మండవల్లి సెక్టారు సూపర్‌వైజర్ నాగలక్ష్మి అన్నారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా కైకలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కానుకొల్లు జడ్పీ పాఠశాలలో సోమవారం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికా విద్య బాల్య వివాహాల నిర్మూలన, ఆరోగ్య సూత్రాలు, పౌష్టికాహారం, పోక్సో చట్టంపై వివరించిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, అంగన్వాడీ కార్యకర్తలు శివగంగ, రత్నకుమారి, ఆశ కార్యకర్త మాధవి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో చిత్రపటాల ఆవిష్కరణ



మండవల్లి ఆగస్టు 12 : మండవల్లి మండలం లోకుమూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ చిత్రపటాలను టీడీపీ నాయకులు సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు తలారి రాజేష్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సమయం ఏసుబాబు, బూత్ ఇన్‌చార్జి బాషా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న న్యాయాధికారి శివకిరణ్

కైకలూరు, ఆగస్టు 12: ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని కైకలూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం. శివకిరణ్ అన్నారు. సోమవారం కైకలూరు భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించి చట్టాలపై అవగాహన కల్పించారు. భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పిల్లల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, వివక్షకు గురిచేసినా నేరమన్నారు. దివ్యాంగ విద్యార్థులకు న్యాయపరమైన సమస్యలుంటే పరిష్కరించేందుకు ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. న్యాయవాదులు ఎంఎస్ఎస్ రాజు, పి. పవనకాంత్, ఎంఈఓ డి. రామారావు, భవిత కేంద్రం టీచర్లు జి. వెంకటలక్ష్మి, బి. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవగాహన



నూజివీడు టౌన్, ఆగస్టు 12: నూజివీడు ప్రయివేటు పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో మారిన పదో తరగతి హిందీ సబ్జెక్ట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నూజివీడు రోటరీ క్లబ్‌లో సోమవారం నిర్వహించారు. నూజివీడు ఎస్.ఆర్.ఆర్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయిని హేమలత ముఖ్య అతిథిగా హాజరై ఉమ్మడి కృష్ణా జిల్లాల పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన 60 మంది ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అస్పా రాష్ట్ర నాయకుడు గొల్లపూడి మోహన్‌రావు, త్రివిధ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, కుమార్ విద్యా సంస్థల అధినేత పీవీ కుమార్, చెన్నంశెట్టి కృష్ణ, రోటరీ అధ్యక్షుడు నరేంద్ర, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ గ్రామ సదస్సులు

కలిదిండి, ఆగస్టు 12 : మండలంలో ఈ నెల 16 నుంచి నిర్వహించే రెవెన్యూ గ్రామ సదస్సులను విజయవంతం చేయాలని తహసీల్దార్ రామకృష్ణ సోమవారం ప్రకటనలో కోరారు. గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరిస్తామన్నారు. ఈ నెల 16న తాడినాడ, 19న పోతుమర్రు, 21న కాళ్లపాలెం, 23న కొండూరు, 24న వెంకటాపురంలో నిర్వహిస్తామన్నారు. అలాగే 27న కలిదిండి, 29న సానారుద్రవరం, 30న కోరుకొల్లు, సెప్టెంబరు 2న ఆవకూరు, 4న కొచ్చెర్ల, 6న కొండంగి, 9న మట్టగుంట, 11న అమరావతి, 13న పెదలంక గ్రామాల్లో సదస్సులు జరుగుతాయన్నారు.

ఇంటింటా జాతీయ జెండా ఎగరాలి

ఆగిరిపల్లి, ఆగస్టు 12: ప్రధాని మోదీ పిలుపుమేరకు ఆగస్ట్ 15న ప్రతి ఇంటిపైనా త్రివర్ణ పతాకం ఎగరాలని నూజివీడు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ జీఆర్కే రంగారావు కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు కొవ్వలి బాబూరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జలసూత్రం శేషగిరి, రెడ్డి రామారావు, టి.వెంకట్రావు, సత్యనారాయణ మాటూరి ప్రసాద్ పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

కైకలూరు, ఆగస్టు 12: గ్రామాల్లో దోమల నివారణకు మలాథియాన్‌ను పిచికారీ చేస్తున్నట్లు సర్పంచ్ ఉలిసి వసంత కుమారి అన్నారు. సోమవారం గోపవరంలో దోమల నివారణకు సీతనపల్లి పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో పిచికారీ చేశారు. నివాస గృహాల్లో ఎక్కడా మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించి, లార్వా నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. పాఠశాల హెచ్‌ఎం కె గ్లోరి, అంగన్వాడీ టీచర్ పి. సుజాత, వైద్య సిబ్బంది జి. శ్రీనివాసరావు, ఎ. తాతారావు, ఆర్. నరేష్, కృష్ణకుమారి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



సింగరాయపాలెం కూడలిలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి



వడాలిలో ఆర్‌అండ్‌బీ రహదారిపై భారీ గొయ్యి

గోతులు బాబోయ్ గోతులు

ముదినేపల్లి, ఆగస్టు 12 : ముదినేపల్లి ప్రాంతంలోని ప్రధాన రహదారులు వర్షాలకు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. మూడేళ్లగా ఏర్పడిన చినగోతులు పెద్ద వై వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా ఉన్నా నాటి వైసీపీ ప్రభుత్వం రోడ్ల మరమ్మతులకు పైసా విదల్చక పోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ముదినేపల్లి నుంచి సింగరాయపాలెం మీదుగా కోరుకొల్లు, గుడ్లవల్లేరు ప్రధాన రహదారుల తోపాటు, వడాలి-చిగురుకోట, కొత్తపల్లి-కోరు కొల్లు, విశ్వనా ద్రిపాలెం- పెదగొన్నూరు, చౌటపల్లి- కోడూరు-అత్తివాని చెరువు రహదారులు ఛిద్రమై నిత్యం ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. గోతుల్లో వాహనాలు బోల్తా పడటం ఇటీవల కాలంలో ఎక్కువైంది. కనీసం గోతులను పూడ్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. నిధులు లేక రోడ్లను బాగు చేయలేక పోతున్నామని అధికారులు తమ అశక్తతను వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు భోజనం సక్రమంగా పెట్టడం లేదు

కలెక్టర్‌కు విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు



వడ్డించిన అన్నం, కూర

ఏలూరు రూరల్, ఆగస్టు 12: ముసునూరు ఏపీఆర్ఎస్‌జీఎస్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదని విద్యార్థుల తల్లి దండ్రులు సోమవారం కలెక్టర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. మెనూలో తరచూ గుడ్డు, అరటిపండు, చిక్కీ పెట్టకుండా ఆపేస్తున్నారని, పాఠశాల డిప్యూటీ వార్డెన్ కూరగాయల బిల్లులు టెండర్లు కాకుండా ఇష్టం వచ్చినట్లు రాసుకుంటున్నట్లు ఫిర్యాదు చేశారు. గత నెల అన్నంలో పురుగులు ఉండడం వల్ల పిల్లలు తినలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పాఠశాలలో చదవలేమంటూ తమ పిల్లలు ప్రతిరోజూ ఏడుస్తున్నారని ఫిర్యాదు చేశారు. సమస్యల ను విద్యా కమిటీ చైర్మన్ సమావేశంలో తెలియచేసినా సమాధానం చెప్పలేదన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సీహెచ్ కీర్తన, యు.హారిక, లావణ్య, విజయ ఉన్నారు.



ర్యాలీలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

డ్రగ్స్ రహిత భారత్ ధ్యేయం కావాలి

నూజివీడు టౌన్, ఆగస్టు 12: నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో ప్రదర్శన, మారథాన్ నిర్వహించారు. వికసిత్ భారత్ కా మంత్ర్, భారత్ హో నషే సే స్వతంత్ర్ అనే థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. స్టూడెంట్స్ వెల్ఫేర్ టీంలు బ్రహ్మస్వాములు, భవాని, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు నవీన్‌కుమార్, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో ఆక్రమణలు తొలగించాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న జనసేన నాయకులు

నూజివీడు టౌన్, ఆగస్టు 12: రజకుల శ్మశాన వాటికలో ఆక్రమణలను తొలగించాలని నూజివీడు ఆర్డీవో వై.భవాని శంకరికి ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన అధికార ప్రతినిధి మరీదు శివ రామకృష్ణ వినతిపత్రం అందించారు. సుమారు వందేళ్లుగా ఉపయోగిస్తున్న శ్మశాన వాటికను కొందరు ఆక్రమించి బెదిరింపులకు దిగుతున్నారని గ్రామ పెద్దలతో కలిసి ఆర్డీవో దృష్టికి తెచ్చారు. జనసేన నూజివీడు మండల అధ్యక్షుడు రాము, నియోజకవర్గ నాయకులు ముమ్మలనేని సునీల్ కుమార్, ముత్యాల కామేషు తదితరులు పాల్గొన్నారు.

8 అర్జీల స్వీకారం..

'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్డీవో భవానిశంకరి అధికారులను కోరారు. సోమవారం మొత్తం 8 అర్జీలు అందినట్టు ఆమె తెలిపారు.

హాస్టల్లో ఆర్డీవో తనిఖీలు

నూజివీడు టౌన్, ఆగస్టు 12: నూజివీడు బాలుర సమీకృత వసతి గృహాన్ని ఆర్డీవో వై.భవానిశంకరి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న భోజన సదుపాయాలు, పారిశుధ్య చర్యలు పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా మురళీమోహన్

చాట్రాయి, ఆగస్టు 12: చాట్రాయి మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా మురళీమోహన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మురళీమోహన్ ఇదే కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్నారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న మంగాకుమారిని ఏలూరు కలెక్టరేట్‌లో రిపోర్టు చెయ్యాలని ఉన్నతాధికారులు ఆదేశాలివ్వటంతో ఆమె రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, సిబ్బంది సహకారంతో ప్రజలకు సత్వరం సేవలు అందించటానికి కృషి చేస్తానన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

చాట్రాయి, ఆగస్టు 12: ఇటీవల బాధ్యతలు చేపట్టిన చాట్రాయి తహసీల్దార్ ప్రశాంతిని సోమవారం టీడీపీ మం డల నాయకులు మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. భూము లు, ప్రజా సమస్యలు ఆమె దృష్టికి తెచ్చారు. రైతులు, ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, బొట్టు రామచంద్రరావు, నోబుల్ రెడ్డి, అత్తులూరి శ్రీనివాసరావు, మరిడి చిట్టిబాబు, తల్లాడ శ్రీనివాసరావు, రాజారత్నం, చిమటబోయిన పుల్లారావు, రాజాబాబు, రాయవరపు పుల్లారావు తహసీల్దార్‌ను కలిశారు.

ముదినేపల్లి ఎంపీడీవో బదిలీ

ముదినేపల్లి, ఆగస్టు 12 : ముదినేపల్లి ఎంపీడీవో ఎస్.మురళీ గంగాధరరావు బదిలీ అయ్యారు. ఆయనను పశ్చిమ గోదావరి జిల్లాకు కేటాయిస్తూ ఉమ్మడి కృష్ణా జడ్పీ సీఈఓ డాక్టర్ ఆర్.సి.ఆనంద్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ముందు ఆయన పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు ఎంపీడీవోగా పనిచేస్తూ ముదినేపల్లి మండలానికి బదిలీపై వచ్చారు. ఇక్కడి నుంచి గుంటూరు జిల్లా పెదకూరపాడు ఎంపీడీవో గా బదిలీ అయిన మల్లీశ్వరి తిరిగి ముదినేపల్లి ఎంపీడీవోగా రానున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి, ఆగస్టు 12: మండలంలోని జనార్దనవరం, ఆరుగొలనుపేట గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం 13వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ సంజయ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, ఆగస్టు 12: కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ మంగళవారం ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయన వరహాపట్నంలోని ఆయన వరహాపట్నంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం 4 గంటలకు ముదినేపల్లిలో ఎన్డీయే కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొని అనంతరం విజయవాడ వెళ్తారు.

నూజివీడు అభివృద్ధికి సహకరించండి



ఎంపీతో ముద్దరబోయిన

నూజివీడు టౌన్, ఆగస్టు 12: నూజివీడు అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు రాబట్టేం దుకు కృషి చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కోరారు. ఏలూరులోని ఎంపీ కార్యాలయంలో ఎంపీని ముద్దరబోయిన కలిసి నూజివీడు స్థితిగతులు వివరించారు. గత ప్రభుత్వంలో నూజివీడు నియోజకవర్గం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని చింతలపూడి ఎత్తిపోతల పథకం త్వరితగతిన పూర్తి చేస్తే మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేయవచ్చన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను జగన్ రెడ్డి దారి మళ్లించడంతో గ్రామాల్లో అంతర్గత రహదారులు అస్తవ్యస్తంగా మారాయని, కేంద్రం నిధులతో అభివృద్ధి చేయించాలని ఎంపీని కోరినట్టు చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం

నూజివీడు టౌన్, ఆగస్టు 12: నూజివీడు మండలం గొల్లపల్లి పీహెచ్‌సీ పరిధిలోని తుక్కులూరులో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.శ్రీనివాస్ గౌతమ్, షేక్ నజ్మా ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందించారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, పద్మావతి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.